# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 34 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 26 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 34 26-03-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-







## ఏప్రిల్ మొదటి వారంలో..
# మెగా డీఎస్సీ నోటిఫికేషన్

అమరావతి మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుద్యోగ యువతకు శుభవార్త అందించారు. ఏప్రిల్ మొదటి వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, నియామక ప్రక్రియను వేగంగా పూర్తిచేస్తామని ప్రకటించారు. జూన్ నాటికి స్కూళ్లు ప్రారంభం అయ్యేలోపు నియామకాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. సచివాలయంలో కలెక్టర్ల సమావేశంలో సీఎం మాట్లాడుతూ, గత ఐదేళ్లలో రాష్ట్రానికి నష్టం వాటిల్లిందని, ప్రజలు ఇప్పుడు అభివృద్ధి కోరుకుంటున్నారని అన్నారు. “2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. అమరావతిని ప్రపంచంలోనే ఉత్తమ మోడల్‌గా అభివృద్ధి చేస్తాం” అని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకత పాటిస్తూ, యువతకు అవకాశాలు కల్పిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

**మెగా డీఎస్సీ నోటిఫికేషన్**


ఏపీ నిరుద్యోగులు అనేకకాలంగా ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ప్రకారం, ఏప్రిల్ మొదటి వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. త్వరితగతిన నియామక ప్రక్రియను పూర్తి చేసి, జూన్ నాటికి స్కూళ్ల ప్రారంభానికి ముందే ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఖాళీలు భర్తీ

- తరువాయి 2లో..



## తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌కు
# కోట్లు అప్పుల భారం

అమరావతి మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌కు కోట్లు అప్పుల భారం ఆంధ్రప్రదేశ్‌కు 2025 మార్చి 31 నాటికి మొత్తం రూ.5,62,557 కోట్లు అప్పు ఉంటుందని, తెలంగాణ అప్పు రూ.4,42,298 కోట్లుగా ఉందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను వివరించారు.ఆంధ్రప్రదేశ్ అప్పులు స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో 34.7 శాతం ఉండగా, తెలంగాణ అప్పులు 26.2 శాతంగా నమోదయ్యాయని తెలిపారు. ఈ గణాంకాలను పరిశీలిస్తే, ఆర్థిక పరంగా రెండు రాష్ట్రాలు ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నాయో స్పష్టమవుతుంది. అప్పుల భారం పెరగడం పట్ల ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉంటే, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై వచ్చిన సందేహాలకు కేంద్రం సమాధానం

- తరువాయి 2లో..

## తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్

**నలుగురు కొత్త మంత్రులు ప్రమాణం స్వీకారం చేసే అవకాశం**

**ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారికి మంత్రివర్గంలో చోటు**



హైదరాబాద్,మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. నలుగురు కొత్త మంత్రులు ప్రమాణం స్వీకారం చేయనున్నారు. ఏప్రిల్ 3న వీరి ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని తెలుస్తోంది. ఇక నలుగురు మంత్రుల్లో ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీ సామాజిక

- తరువాయి 2లో..

## రూ.5,058 కోట్ల వార్షిక బడ్జెట్‌కు
# టీటీడీ ఆమోద ముద్ర

తిరుమల, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి ఇటీవల జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూచనల ప్రకారం భక్తుల సంక్షేమాన్ని, ఆలయ పరిరక్షణను, భూముల రక్షణను దృష్టిలో పెట్టుకుని పలు నిర్ణయాలను ఆమోదించింది. మొత్తం రూ.5,058 కోట్ల రూపాయల వార్షిక బడ్జెట్‌కు కూడా ఆమోద ముద్ర వేసింది. వృద్ధులు, దివ్యాంగ భక్తులు

- తరువాయి 2లో..



## గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతులు : బొత్స

అమరావతి మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్‌లో రైతులు తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్నారని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా మిర్చి, చెరుకు రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులకు తగిన ధర అందకపోవడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని చెప్పారు.

**మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది**

రాష్ట్రంలోని మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బొత్స ఆరోపించారు. మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్క కేజీ మిర్చినైనా కొనుగోలు చేసిందా? అంటూ ప్రశ్నించారు. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అనుకూలమైన విధానాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**చెరుకు రైతుల పరిస్థితి మరింత దారుణం**

చెరుకు రైతుల పరిస్థితి మరింత విషాదకరంగా మారిందని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ధర లేక, రైతులు తమ చెరుకు పొలాల్లోనే కాల్చుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ఎలాంటి

- తరువాయి 2లో..

# ఆస్తి పన్ను వడ్డీ బకాయిల్లో 50 శాతం రాయితీ

అమరావతి మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆస్తి పన్ను బకాయిదారులకు మున్సిపల్ శాఖ శుభవార్త అందించింది. పలు నగరాలు, పట్టణాల్లో ఆస్తి పన్ను బకాయిలు అధికంగా పేరుకుపోవడంతో ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. ప్రాపర్టీ ట్యాక్స్‌లో పెండింగ్‌లో ఉన్న వడ్డీ బకాయిలపై 50 శాతం రాయితీ కల్పిస్తూ మున్సిపల్ శాఖ తాజా జీవోను జారీ చేసింది.

**ఈ నెలాఖరు వరకు అవకాశం**

ప్రభుత్వం ఇచ్చిన తాజా ప్రకటన ప్రకారం, ఈ నెలాఖరు (మార్చి 31) వరకు ఈ రాయితీ అమల్లో ఉంటుంది. దీంతో ఆస్తి పన్ను బకాయిదారులు తక్కువ మొత్తాన్ని చెల్లించి తమ బకాయిలను క్లియర్ చేసుకునే అవకాశాన్ని పొందనున్నారు. దీనివల్ల పన్ను వసూళ్లు పెరిగి, మున్సిపల్ శాఖకు గణనీయమైన ఆదాయం సమకూరనుందని అధికారులు తెలిపారు.

**ప్రజల విజ్ఞప్తుల మేరకు తీసుకున్న నిర్ణయం**

కొన్ని సంవత్సరాలుగా ఆస్తి పన్నులపై భారీగా వడ్డీ పెరుగుతూ ఉండటంతో ప్రజలు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు తాత్కాలిక ఊరట కలిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**ఆర్థికంగా లాభదాయకం %-% వసూళ్లు పెరిగే అవకాశం**

పన్ను బకాయిలకు 50% వడ్డీ మాఫీ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరనుంది. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల బకాయిలను త్వరితగతిన వసూలు చేయడానికి ఇది సరైన అవకాశం అని మున్సిపల్ శాఖ భావిస్తోంది. అందువల్ల, బకాయిలను తొందరగా చెల్లించి ఈ అవకాశం ఉపయోగించుకోవాలని అధికారులు పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కలెక్టర్లుకు సీఎం స్వీట్ వార్నింగ్

## కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు కీలక సూచనలు

- కలెక్టర్లు జిల్లా ముఖ్య నిర్వహణాధికారులు
- ఏసీ రూమ్‌లకు కలెక్టర్లు పరిమితం కావదన్న సీఎం
- విజన్ 2047పై ప్రధానంగా కలెక్టర్లు దృష్టి పెట్టాలని సూచన



అమరావతి మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ఏపీ సచివాలయంలో ఈ రోజు, రేపు రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభమైంది.. అయితే, కలెక్టర్లకు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కలెక్టర్లు జిల్లా ముఖ్య నిర్వహణా అధికారులు అన్నారు సీఎం చంద్రబాబు. ఏసీ రూమ్‌లకు కలెక్టర్లు పరిమితం కావద్దన్నారు.. రెండు రోజుల కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు అన్ని విషయాలు ప్రస్తావించారు%ా% విజన్ 2047పై ప్రధానంగా కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు.. పెన్షన్లను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అన్నారు.. సోలార్ పవర్‌లో భాగంగా 20 లక్షల మందికి సోలార్ పవర్ ఇవ్వడంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ ను ప్లాన్ చేసే పనిలో కలెక్టర్లు ఉండాలని స్పష్టం చేశారు.. ప్రజల్లో అత్యంత ప్రభావం కలిగించే వ్యక్తి కలెక్టర్.. కెరీర్‌లో కలెక్టర్ చీఫ్ సెక్రెటరీకి ఇవే ముఖ్యం అన్నారు..**

ఇక, రొటీన్‌గా ఉంటే ఏడాది అవుతుంది.. మరో నాలుగేళ్లు కూడా గడిచిపోతాయి అన్నారు సీఎం చంద్రబాబు.. ఈ ప్రభుత్వం.. సంక్షేమం.. అభివృద్ధి.. సుపరిపాలన%ా% ఈ మూడు గుర్తుండాలి.. ప్రజలు ఆనందంగా ఉండాలంటే సంక్షేమం కావాలి.. పెన్షన్ల విషయంలో ప్రభుత్వం చాలా ఉదారంగా ఉంది.. కేవలం పెన్షన్ల కోసం ఏడాదికి 33 వేల కోట్లు అవుతోందని వెల్లడించారు. అమరావతి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్.. ప్రజల్ని ప్రోగ్రెస్ లో భాగస్వామ్యం చేయాలన్నారు.. 20 లక్షల మందికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తాం.. ఎట్టి పరిస్థితుల్లో కలెక్టర్లు.. సోలార్ రూఫ్ టాప్ పై దృష్టి పెట్టాలన్నారు.. ప్రీ మాన్ సూన్ పోస్ట్ మాన్ సూన్ పై దృష్టి సారించాలి.. ప్రతి జిల్లా కలెక్టరు అరకు కాఫీ పై ఫోకస్ చేయాలన్నారు.. మరోవైపు, మే నెలలో తల్లికి వందనం ఇస్తాం.. త్వరలో విధి విధానాలు వస్తాయని తెలిపారు. 26 జిల్లాల కలెక్టర్ల పెర్ఫామెన్స్ పై సమీక్ష జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047.. వికసిత్ భారత్ పై ప్రధాని నరేంద్ర మోడీ దృష్టి పెట్టారు.. అందుకు అనుగుణంగా.. 175 నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్‌లు ఉంటాయన్నారు.. ఎమ్మెల్యే ఆ నియోజకవర్గానికి చైర్మన్ గా ఉంటారని తెలిపారు సీఎం చంద్రబాబు..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## మరిన్ని ప్రయోగాలకు మార్గదర్శనం!

తొమ్మిది నెలల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి మళ్లీ భూమ్మీదకు చేరారు. చాలామంది సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లో ఇరుక్కుపోయారని అన్నారు. ఈ వర్ణన అంత సరైంది కాదు. ఐఎస్-ఎస్‌లో దీర్ఘకాలం ఉండటం ఇదే మొదటిసారి కాదు. సుమారు పాతికేళ్లుగా మనుగడలో ఉన్న ఐఎస్ఎస్‌లో నిత్యం యూఎస్, రష్యా, యూరప్, జపాన్ వ్యోమగాములు ఉంటూనే ఉన్నారు. ఒక్కొక్కరి కాలావధి వేర్వేరుగా ఉండవచ్చు.

కనీసం 4 నుంచి 8 మంది వ్యోమగాములు జీవశాస్త్ర, బయోమెడికల్, మొక్కలకు సంబంధించిన ప్రయోగాలు చేస్తూ వచ్చారు. గత వారం కొద్ది కాలమైనా సరే... దాదాపు 11 మంది వ్యోమగాములు ఐఎస్ఎస్‌లో గడిపారు. పరిశోధనలు చేయడంతోపాటు ఉపగ్రహాలను ప్రయోగించడం, ఐఎస్ఎస్ నిర్వహణ పనులు చేశారు వీరందరూ! స్పేస్ వాక్స్ ద్వారా ఐఎస్ఎస్ వెలుపల ఉండే రోబో చేతుల మర మ్మతులు కూడా ఉన్నాయి ఈ పనుల్లో! వ్యోమగాములు నిత్యం ఐఎస్ఎస్‌లో ఉంటారు కాబట్టి వారికి ఆహారం, ఇతర సరుకుల రవాణా ఎప్పటికప్పుడు జరిగింది.

అంతరిక్ష కేంద్రంలో సునీత, విల్మోర్‌లు 286 రోజుల పాటు ఉండటం చాలా ఎక్కువ అనిపిస్తుంది కానీ... కొత్త కాదు. ఫ్రాంక్ రూబియో విషయాన్నే తీసుకుంటే... 2023 సెప్టెంబరులో ఆయన 371 రోజులపాటు అంతరిక్ష కేంద్రంలో ఉండి రికార్డు సష్టించారు. ఈ క్రమంలో ఆయన 2022లో మార్క్ వెండే హే 355 రోజుల రికార్డును బద్దలు కొట్టారు. అయినప్పటికీ సోవియట్ యూనియన్ కాస్మోనాట్ల రికార్డులతో పోలిస్తే ఇవి తక్కువ.

సోవియట్ యూనియన్ ప్రయోగించిన 'మిర్' అంతరిక్ష కేంద్రమే... కాలక్రమంలో ఇతర దేశాల భాగస్వామ్యంతో ఐఎస్ఎస్‌గా రూపాంతరం చెందిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. భౌతిక శాస్త్రవేత్త, కాస్మోనాట్... వలేరీ పోల్యాకోవ్ 1994%-%95లో ఏకాయెకిన సుమారు 437 రోజులపాటు మిర్ స్టేషన్‌లో గడిపారు. ప్రస్తుతం చైనా సిద్ధం చేసిన అంతరిక్ష కేంద్రం టియాన్ గాంగ్‌లో ముగ్గురు వ్యోమగాములు 139 రోజులుగా ఉంటు న్నారు. వీరిలో కాయ్ షఉజీకి అంతరిక్షంలో 320 రోజులు గడిపిన అనుభవం ఉంది.

### లక్ష్యాల్లో ఒకటి అదే...

అంతరిక్ష కేంద్రం ఏర్పాటు లక్ష్యాల్లో ఒకటి%-% దీర్ఘకాలం అంతరిక్షంలో గడపడం. గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఎక్కువ సమయం గడిపితే మనకేం అవుతుందన్న విషయాన్ని అర్థం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇలా ఎక్కువ కాలం అక్కడ గడిపినప్పుడు ఎముకలు, కండరాలు బలహీనపడతాయన్న విషయం మాత్రం ఆందోళన కలిగించే వ్యవహారమే.

1970లలో శాల్యూట్, స్కైల్యాబ్‌లతో ప్రయోగాలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ అంశాలకు సంబంధించి బోలెడంత సమాచారం సేకరించారు. బయో మెడికల్ సమాచా రాన్ని సేకరించడమే లక్ష్యంగా పలు పరిశోధనలు జరిగాయి. ఉదాహరణకు ప్రస్తుత అంతరిక్ష యాత్రలో విల్మోర్ సైక్లింగ్, రోయింగ్, రెసిస్టెన్స్ వ్యాయామాలను కలిపి చేయగల ఒక పరికరాన్ని ఐఎస్ఎస్‌లో ఏర్పాటు చేయడానికి సాయ పడ్డారు.

ఎక్కువ సమయం ఇక్కడ గడపాల్సిన వ్యోమ గాములు ఈ పరికరం ద్వారా వ్యాయామాలు చేస్తే కండ రాలు, ఎముకలు మరీ గుల్లబారకుండా ఉంటాయి. గుండెకూ మేలవుతుంది. గుండె కొట్టుకునే వేగం, శ్వాస, రక్త పోటు వంటి... గుండె%-%రక్తనాళాలకు సంబంధించిన డేటాను సేకరించడానికీ, ఉష్ణోగ్రతలను వ్యోమగాములు వేసుకునే దుస్తుల్లో ఉంచిన సెన్సార్‌ల ద్వారా రాబట్టేందుకూ ఉద్దేశించిన ప్రయోగం కూడా జరిగింది. భవిష్యత్తులో మనిషి జాబిల్లిపై, అంగారకుడిపై నివసించాల్సి వస్తే... ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వారి పరమావధిగా ఉండనుంది.

1970, 1980లలో సోవియట్ యూనియన్ , అమెరికన్ల అంతరిక్ష కేంద్రాల అనుభవం తరువాత ఇది చాలా ఖరీదైన వ్యవహారమని వారికి అర్థమైంది. ఈ కారణంగానే ఐఎస్ఎస్ నిర్మాణం, నిర్వహణ రెండింటినీ అంతర్జాతీయ స్థాయికి చేర్చి పలు దేశాలు పాల్గొనేలా చేశారు. నాసా, కెనడా స్పేస్ ఏజెన్సీ, యూరోపియన్ ఏజెన్సీ, జపాన్ ఏరోస్పేస్ ఎక్స్ ప్లొరేషన్ ఏజెన్సీ, రాస్కోమాస్‌లు ఐఎస్ఎస్ నిర్వహణ బాధ్యతలు చేపట్టాయి. ఆయా ఏజెన్సీలు అందించిన పరిక రాల నిర్వహణ బాధ్యత వారిదే.

2000వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ అరవై ప్రయోగాల ద్వారా ఐఎస్ ఎస్‌ను 21 దేశాలకు చెందిన 260 మంది వ్యోమగాములు సందర్శించారు. భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా కూడా త్వరలోనే ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. ఐఎస్ఎస్ 2030 వరకూ పని చేయనుంది. చైనా ఇప్పటికే ఒక అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోగా... 2035 నాటికి ఒక కేంద్ర నిర్మాణానికి భారత్ ప్రయత్నిస్తోంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో మొదలైన అంతరిక్ష కేంద్రం ఏర్పాటు ఆలోచన ఈ అంతర్జాతీయ ప్రాజెక్టు!

అంతరిక్ష ప్రయోగాల విషయంలో అమెరికా ఒక కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. ప్రైవేట్ కంపెనీల ఆధ్వర్యంలోనే ప్రయోగాలు జరగనున్నాయి. స్పేస్ ఎక్స్, బోయింగ్ వంటివి సరుకు రవాణా కోసం ప్రత్యే కమైన నౌకలను సిద్ధం చేయనున్నాయి. నాసాతో కలిసి పని చేస్తున్న ఈ రెండు సంస్థలూ ఐఎస్ఎస్ నిర్వహణతోపాటు జాబిల్లి, అంగారకుడిపైకి చేరే ప్రయత్నాలు చేస్తున్నాయి.

# రాజధానిలో రాక్షస రాజ్యం

- పాత్రికేయునిపై దాడి
- ప్రజల పక్షాన నిలిస్తే ఫోను లాక్కున్నారు
- పాత్రికేయుడిని దూషించిన సెక్యూరిటీ
- కొత్త ఆసుపత్రి డిప్యూటీ సిఆర్ఎంఓ కు సెక్యూరిటీ రివర్స్ కంప్లైంట్
- పాత్రికేయుడిదే తప్పని తేల్చిన వైనం
- ఆసుపత్రి ఆవరణములో ఫోటోలు తీయవద్దంటూ హుకుం
- ఇక ఆసుపత్రిలో తమ రాజ్యాంగమే అంటున్న వైనం
- సకాలంలో పేదలకు వైద్య సేవలపై ప్రశ్నించడమే నేరమా...?
- నాలుగవ స్తంభానికి నగుబాటు



విజయవాడ, మార్చి 26(తెలుగురాష్ట్రం ప్రతినిధి):
దేశం మొత్తం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు జరుగుతుంటే... అక్కడ మాత్రం కొందరు కుట్రలు కుతంత్రాలతో తమ ఇష్టానుసారం రాసుకునే కథనానికి... కొత్త రాజ్యాంగం అంటూ రూపకల్పన చేశారు. అక్కడ తాము చెప్పిందే వేదం... తాము చేసిందే శాసనం అని.... తమ ఆజ్ఞ మీరితే.... పనిష్మెంట్ తప్పదంటూ హుకుం జారీ చేస్తున్న వైనం. ఇది ఎక్కడో ఆటవిక సమాజంలో అనాగరిక చర్య కానే కాదు.... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నడిబొడ్డున విజయవాడ నగరంలో పట్టపగలు మంగళవారం చోటు చేసుకున్న దుశ్చర్య. వివరాలలోకి వెళితే విజయవాడ నగరంలో ప్రజా పాలన జాతీయ దినపత్రిక స్టేట్ బ్యూరో చీఫ్ పీతల అప్పాజీ తన తండ్రి అనారోగ్య కారణంగా విజయవాడ నగరంలోని ప్రభుత్వ కొత్త ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఎంతోమంది సామాన్యులు వైద్య సేవల కోసం వేచి ఉండడాన్ని చూసి జీర్ణించుకోలేక... పాత్రికేయునిగా తన బాధ్యత నిర్వర్తించే దిశలో భాగంగా ఫోటోలు... వీడియోలు తీసి... మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందించే విధంగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన సెక్యూరిటీ ఫోను లాక్కొని... ఇక్కడ ఫోటోలు వీడియోలు తీయాలంటే మా పరిమిషన్ కావాలంటూ గట్టిగా చెప్పడం జరిగింది. ఇది తన సొంత విషయం కాదని... అనుమతి లేని ప్రాంతాలలో తాను ఫోటోలు వీడియోలు తీయడం లేదని...ప్రజలు మూకుమ్మడిగా వేచి ఉన్న ఓపి ప్రాంతంలో మాత్రమే తాను విధులు నెరవర్తిస్తున్నట్లు పాత్రికేయులు పీతల అప్పాజీ చెప్పినప్పటికీ, వారి మాటలు పెడచెవిన పెట్టారు. నిషేధిత ప్రాంతమే కాదు ఎక్కడ ఫోటోలు వీడియోలు తీయాలన్నా తమ అనుమతి తప్పనిసరిగా ఉండి తీరాలంటూ సెక్యూరిటీ సిబ్బంది చెప్పడం గమనార్హం. తాను అరిచింది కాక... తానే ఏడుస్తూ సెక్యూరిటీ డిప్యూటీ సి ఎస్ ఆర్ ఎమ్ ఓ వద్దకు వెళ్లి పాత్రికేయుడే తనతో పరుష పదజాలం ఉపయోగించినట్లు రివర్స్ కంప్లైంట్ ఇవ్వడం మరోవిడ్డూరం. జరిగిన సంఘటనపై ఏమాత్రం విచారించకుండా సెక్యూరిటీ చెప్పిందే ఫైనల్ అనే విధంగా డిప్యూటీ సి ఆర్ ఎం ఓ మాట్లాడుతూ ఇక్కడ ఫోటోలు వీడియోలు తీయాలంటే ముందుగా పరిమిషన్ తీసుకోవాలని హుకుం జారీ చేశారు. పాత్రికేయుడు ఎంతగా చెప్పే ప్రయత్నం చేసిన వినిపించుకునే స్థితిలో అక్కడి అధికారులు లేకపోవడం దారుణం. ఎంత జరిగినా తనవంతుగా ఏమాత్రం ఆవేశానికి గురికాకుండా విధినిర్వహణలో భాగంగా ప్రజల అవస్థలను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా మాత్రమే ఫోటోలు వీడియోలు తీశానని... ఈ సంఘటనకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారించి... తన తప్పు ఉంటే కచ్చితంగా శిక్షించవచ్చని పాత్రికేయుడు చెప్పినప్పటికీ అధికారులు వినిపించుకోలేదు. ఎప్పటికీ ఇక్కడకు రావద్దంటూ ఫోను తీసుకుని వెళ్లిపొమ్మంటూ బయటకు గెంటినంత పని చేశారు. వృత్తి నిర్వహణలో భాగంగా అత్యవసర మరియు నిషేధిత ప్రాంతం కానీ ప్రదేశంలో ఫోటోలు వీడియోలు తీస్తేనే ఇంతలా స్పందిస్తున్న ప్రభుత్వ నూతన ఆసుపత్రిలో అసలేం జరుగుతోంది.




ఇక్కడ జరిగిన సంఘటన మరో మారు పునరావృతం కాకుండా పాత్రికేయ సహోదరులు ఏకీకృతంగా ఖండించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రాష్ట్రంలో పాత్రికేయులంతా తమ తమ ప్రాంతాలలో పోలీస్... రెవెన్యూ... ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఈ సంఘటనను ఖండిస్తూ... భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని... పత్రికేయుల వృత్తికి అడ్డు పడవద్దు అంటూ వినతి పత్రాలు అందించాలని సవినీయంగా సూచిస్తున్నాం.

**బాధితుడు అప్పాజీ వివరణ:**
ఈ సంఘటనలో తాను ఏ దశలోనూ పరుష పదజాలం వినియోగించలేదని అప్పాజీ స్పష్టం చేశారు. అంతేకాక ఈ సంఘటనలో ఆసుపత్రి వర్గాలకు ఏ క్షణమైనా బాధగా అనిపిస్తే తన ఫోను పూర్తిస్థాయిలో విచారించిన తరువాతే ఇవ్వమని చెప్పినప్పటికీ ఎవ్వరూ వినలేదని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితులలో పాత్రికేయ వృత్తిలో కొనసాగే వారికి రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. ఎక్కడైనా ఒక సంఘటన జరిగితే ఇరువర్గాల వాదనలు విని... పూర్తిస్థాయి విచారణ అనంతరం తగిన చర్యలు చేపట్టటం జరుగుతుందన్నారు. ఈ ఆసుపత్రిలో అడుగడుగునా సిసి ఫుటేజ్ లు ఉన్నాయని... వాటిని పరిశీలించి విచారణ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులపై అన్ని సంఘాల పాత్రికేయులు ఒకే వేదికపైకి వచ్చి ఖండించాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌కు కోట్లు అప్పుల భారం

ఇచ్చింది. ఈ కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల మేరకు ఈక్విటీ మూలధనాన్ని సమకూర్చిందని, ఇందులో ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రవేశపెట్టే యోచన లేదని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ భవిష్యత్తుపై గత కొంతకాలంగా ఊహాగానాలు జరుగుతున్నాయి. అయితే, ప్రభుత్వ స్పష్టతతో కార్మికులలో కొంతవరకు భరోసా ఏర్పడింది.ఈ పరిణామాల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అప్పుల భారాన్ని ఎలా తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తాయో చూడాల్సి ఉంది. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రాలకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందా? లేదా? అన్నదానిపై ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది. ఏపీ, తెలంగాణ ఆర్థిక పరిస్థితులపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

## ఏప్రిల్ మొదటి వారంలో.. మెగా డీఎస్సీ నోటిఫికేషన్

చేయనున్నారు. దీని ద్వారా వేలాది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం యువత భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం తెలిపారు.

**సుపరిపాలన లక్ష్యం**
సచివాలయంలో కలెక్టర్ల సమావేశంలో మాట్లాడిన సీఎం చంద్రబాబు, గత ఐదేళ్ల పాలనపై విమర్శలు చేశారు. "గత ఐదేళ్లలో ఒక వ్యక్తి రాష్ట్రాన్ని విధ్వంసం చేశాడు. ప్రజలు ఆ పాలనతో విసిగి మాకు మద్దతు ఇచ్చారు. అందుకు కృతజ్ఞతలు. ప్రజలకు సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాం" అని ఆయన స్పష్టం చేశారు.

**డీఎస్సీ నియామక ప్రక్రియ**
ఈ డీఎస్సీ నియామకాలను ఎస్సీ వర్గీకరణ ప్రకారం భర్తీ చేస్తామని సీఎం ప్రకటించారు. నియామక ప్రక్రియ పూర్తయిన వెంటనే అభ్యర్థులను పనిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూన్ నాటికి స్కూళ్లు ప్రారంభమయ్యేలోపు ఉపాధ్యాయుల నియామకాన్ని పూర్తిచేస్తామని ఆయన తెలిపారు.

**పోలవరం, అమరావతి ప్రాజెక్టులు**
అలాగే, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని ఓ సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి, ప్రపంచంలోనే బెస్ట్ మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులకు నష్టం జరిగినా, తిరిగి వాటిని పునరుద్ధరించి ముందుకు తీసుకెళ్తామని సీఎం నవరూపనిచ్చారు.

**ఉద్యోగులకు భరోసా**
చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిరుద్యోగులకు భరోసా ఇస్తోంది. మెగా డీఎస్సీతో పాటు మరిన్ని ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాలని కృషి చేస్తోంది. ప్రభుత్వ విధానాలను కార్యరూపం దాల్చి, పారదర్శకంగా అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అవినీతి రహిత పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని సీఎం ప్రకటించారు. ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, అభ్యర్థులకు సముచిత అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చంద్రబాబు తెలిపారు.

## తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్

వర్గాలకు చెందిన వారికి మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు సమాచారం.ఈ మేరకు రాష్ట్ర కోర్ కమిటీ నుంచి ఏఐసీసీ వివరాలు తీసుకుందని తెలుస్తోంది. రెడ్డి సామాజిక వర్గంలో రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉంది. ఎస్సీలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి... బీసీ సామాజిక వర్గంలో ఆది శ్రీనివాస్, శ్రీహరి ముదిరాజ్‌లకు చోటు దక్కే అవకాశం ఉందని సమాచారం. మొత్తం ఆరు ఖాళీల్లో నాలుగింటిని భర్తీ చేసే అవకాశం ఉంది. ఒకవేళ మరో స్థానం భర్తీ చేయాలనుకుంటే మైనారిటీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది.

## రూ.5,058 కోట్ల వార్షిక బడ్జెట్‌కు టీటీడీ ఆమోద ముద్ర

ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని వారికి ఆఫ్‌లైన్‌లో దర్శన టికెట్లు కేటాయించే పద్ధతిని మళ్లీ ప్రారంభించేందుకు టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. భక్తులకు మరింత సౌకర్యంగా ఉండేలా ఈ విధానాన్ని సమీక్షించి త్వరలోనే కొత్త మార్గదర్శకాలను ప్రకటించనుంది. టీటీడీ పర్మినెంట్ ఉద్యోగులకు ప్రత్యేకంగా మూడు నెలలకు ఒకసారి 'సుపథం దర్శనం' అందించనుంది. ఇది ఉద్యోగులకు స్వామివారి దర్శనం కల్పించే మరొక ప్రత్యేక అవకాశంగా మారనుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని %ఎఖా% దర్శన వేళల్లో మార్పులు చేయాలని టీటీడీ నిర్ణయించింది. భక్తులకు సాధారణ దర్శనాన్ని మరింత వేగంగా అందించేందుకు ఈ మార్పు చేయనున్నారు.

**టీటీడీ ఆస్తుల పరిరక్షణకు కఠిన నిర్ణయాలు**
శ్రీవారి ఆలయానికి సంబంధించిన భూములు, ఆస్తులు ఇతరుల చేతిలోకి వెళ్లకుండా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఆలయ ఆస్తులపై ఉన్న వివాదాలను త్వరగా పరిష్కరించి వాటిని భక్తుల సేవలోకి తీసుకురావడానికి న్యాయపరమైన చర్యలు వేగంగా తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. టీటీడీలో విధులు నిర్వహిస్తున్న హిందూయేతర ఉద్యోగులను వారి హోదాకు తగిన విధంగా బదిలీ చేయడం లేదా వీఆర్ఎస్ (వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్) ద్వారా తొలగించడం జరుగుతుంది. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. తిరుమల పరిసరాల్లో ఏడు కొండలకు ఆనుకుని వ్యాపార కార్యకలాపాలకు అనుమతి ఇవ్వకూడదనే నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే వ్యాపారం నిర్వహిస్తున్న ప్రభుత్వ విభాగాలకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించేందుకు ప్రణాళిక రూపొందించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముంతాజ్ హోటల్‌కు ఇచ్చిన భూమిని రద్దు చేస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో అలాంటి కేటాయింపులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. తిరుపతిలో సైన్స్ సిటీ కోసం కేటాయించిన భూములు వాడకంలోకి రాలేదు కాబట్టి వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు.

**టీటీడీ ఆలయాల నిర్మాణ ప్రణాళిక**
దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. ఇప్పటికే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు భూముల కేటాయింపు కోసం లేఖలు పంపించింది. భూమి లభించగానే ఆలయాల నిర్మాణ ప్రక్రియ వేగంగా ప్రారంభించనుంది. ఆర్థిక స్థోమత లేక నిర్మాణంలో నిలిచిపోయిన ఆలయాలను పునరుద్ధరించేందుకు శ్రీవాణి ట్రస్టు నిధుల నుంచి సహాయం అందించాలని నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా శిధిలమైన ఆలయాలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నారు. అమరావతిలో జరిగిన శ్రీవారి కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించిన టీటీడీ. దీన్ని రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. టీటీడీ తీసుకున్న ఈ కీలక నిర్ణయాలు భక్తులకు మరింత సేవలు అందించడమే కాకుండా, ఆలయ ఆస్తుల పరిరక్షణ, ధార్మిక చట్టాల్లో మార్పులు, హిందూ మత పరిరక్షణకు దోహదపడతాయి. టీటీడీ పర్మినెంట్ ఉద్యోగులకు మూడు నెలలకు ఒకసారి సుపథం దర్శనం కల్పించడంతో పాటు వీఐపీ దర్శన వేళలను మారుస్తామని చెప్పారు టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు.

## గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతులు : బొత్స

చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల అన్నదాతలు కష్టాలు పడుతున్నారని, తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

**రైతులకు రక్షణ కల్పించాల్సిన అవసరం**
రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని, వారికి తగిన గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బొత్స స్పష్టం చేశారు. రైతుల ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ మార్కెట్‌లో లోటు భర్తీ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే, ప్రజలంతా కలిసి ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి వస్తుందని బొత్స హెచ్చరించారు.

# వికలాంగులకు ఉపకరణాలు అందజేత..



గోపాలపట్నం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ విప్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని వికలాంగులకు ఉపకరణాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ డేవిడ్ ఫిన్నే, పెంటకోట అజయ్ బాబు, కుట్టా కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు పాఠశాల కంటే వీడియో గేమ్స్ అంటే ఎందుకు ఇష్టం?



**"మా బాబుకు స్మార్ట్‌ఫోన్ ఇవ్వకపోతే అరుపులు, కేకలు. ఇల్లంతా రచ్చరచ్చ చేసేస్తాడు. కానీ పుస్తకాలు తీస్తే బోలెడంత బద్ధకం. చదువంటే ఎప్పుడూ తప్పించుకునే ప్రయత్నమే. కానీ అదే వీడియో గేమ్ ఆడేటప్పుడు ఏమీ తినకుండా, తల ఊపకుండా గంటల తరబడి కూర్చుంటాడు!"**

ఇలాంటి మాటల్ని మీరు రోజూ వింటూనే అంటారు.

దానికి మీరేం సలహా ఇస్తారు?

"ఈ తరం పిల్లలు స్క్రీన్‌కు బానిసలైపోయారు."

"వీడియో గేమ్స్ బ్రెయిన్‌ను వదిలిపెట్టకుండా హైపర్ యాక్టివ్ చేస్తాయి."

"ఇది డిజిటల్ డెమేజ్."

"పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇవ్వకూడదు."

కానీ, అసలు మర్మం ఎక్కడ ఉంది తెలుసా?

వీడియో గేమ్స్ అనేవి సైకాలజీని వాడి డిజైన్ చేసిన అద్భుత ఇంజినీరింగ్.

మొబైల్ గేమ్స్ ఆడే పిల్లవాడిని ఒకసారి గమనించండి%ౌ% "ఈ లెవెల్‌ను కంప్లీట్ చేయాలి", "ఈ శత్రువును ఓడించాలి", "ఈ స్కోరు సాధించాలి" అని అతనికి స్పష్టమైన లక్ష్యం ఉంటుంది.

అతను ప్రయత్నం చేస్తాడు. ఓడిపోతాడు. మళ్లీ ట్రై చేస్తాడు. మళ్లీ ఓడతాడు. చివరికి గెలుస్తాడు.

ఈ ఫీడ్‌బ్యాక్ అతని మెదడులో డోపమిన్ అనే హ్యాపీ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఈ హార్మోన్ కోసమే, అది ఇచ్చే హ్యాపీనెస్ కోసమే అతను మళ్ళీ మళ్ళీ మొబైల్ గేమ్స్ ఆడుతూనే ఉంటాడు.

ఇప్పుడు చదువును పరిశీలిద్దాం. ఓ ఏడో తరగతి పిల్లాడు, మొఘలుల వంశవృక్షం చదవాల్సి ఉంది. అతనికి పాఠం ఎంత పెద్దదో తెలియదు. ఎక్కడ మొదలుపెట్టాలో కూడా స్పష్టత లేదు. పుస్తకంలోని ప్రశ్నల్లో ఏది పరీక్షల్లో వస్తుందో, ఏది గుర్తుంచుకోవాలో తెలియక కంగారు.

పరీక్షలో సరైన సమాధానం రాసినా %-% ఫలితం ఎప్పుడు వస్తుందో తెలీదు. పరీక్షలు వస్తున్నాయంటే "నువ్వేమైనా చదువుతున్నావా?" అంటూ తల్లి, తండ్రి, టీచర్లు ఒత్తిడి పెడతారు. ఆ ఒత్తిడి అతని మెదడులో కోర్టిసాల్ అనే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తుంది.

ఇదే అసలు తేడా.

వీడియో గేమ్ మోటివేట్ చేస్తుంది. చదువు భయం, ఒత్తిడితో నడుస్తుంది.

"సర్, నేను Minecraft ఆడేటప్పుడు ఎంత creative అవుతానో తెలుసా? నా మీద నాకే ఆశ్చర్యం. కానీ అదే స్కూల్‌లో డ్రాయింగ్ competition ఉంటే, ఒక్కసారిగా భయమేస్తుంది. గెలవకపోతే నన్ను తక్కువగా చూస్తారని."

ఇంకొక తండ్రి తన కొడుకును గురించి ఇలా చెప్పాడు... "డాక్టర్ గారు, మా వాడి %ాఖదీ+% స్టాటిస్టిక్స్ మామూలుగా ఉండవు. ప్లానింగ్, లీడర్‌షిప్, టీమ్ వర్క్ – అన్నీ బాగా చూస్తాడు. కానీ అదే క్లాస్‌లో ప్రాజెక్ట్ వచ్చిందంటే మౌనంగా పడుకుంటాడు. ఎందుకంటే అక్కడ creativityతో పని లేదు, కేవలం marks కోసం పని చేయాలి."

వీడియో గేమ్‌లో చిన్న ప్రయత్నానికే పెద్ద గుర్తింపు వస్తుంది. చదువులో మంచి ప్రయత్నం చేసినా మార్కులు రాకపోతే ఎవరూ పట్టించుకోరు. వీడియో గేమ్‌లో స్వాతంత్ర్యం ఉంటుంది. చదువులో నిబంధనలు, డెడ్‌లైన్‌లు, ఫలితాలపై భయం ఉంటుంది.

ఒకసారి నేను ఓ క్లాస్‌లో పిల్లల్ని అడిగాను: "మీరు ఎక్కువ టైం ఏమి చేస్తారు?"

ఒకటి: "గేమ్స్ ఆడతాను."

రెండు: "యూట్యూబ్ చూస్తాను."

మూడు: "కంప్యూటర్ మీద క్రియేట్ చేస్తాను."

చదువు ఎప్పుడూ నాల్గవ ఆప్షన్‌లా ఉంటుంది.

### మనం ఏమి చేయాలి?

వీడియో గేమ్‌లు నిషేధించడం సమస్యకు పరిష్కారం కాదు. స్మార్ట్‌ఫోన్ తీసేయడం వల్ల కూడా సమస్య తీరిపోదు. "నీకు %ఎశీఅఎవత్‌తీఢ్‌ఆశీఅ% లేదు" అని తిట్టడం వల్ల అస్సలు ఉపయోగం ఉండదు.

### మరేం చేయాలంటారా?

పిల్లలు ఏది concentrationతో చేస్తారో గమనించాలి. మన పాఠశాల, మన ఇంటి వాతావరణం కూడా వీడియో గేమ్‌లా మారాలి.

- చిన్న లక్ష్యాలు ఇవ్వండి – చిన్న విజయం పొందిన ఆనందాన్ని అనుభవించాలి.
- ప్రయత్నాన్ని గుర్తించండి – "శబాష్, నువ్వు మంచి ట్రై చేశావు" అనే మాట ఎంతో విలువైనది.
- విఫలమైనా మళ్లీ ప్రయత్నించేందుకు అవకాశం ఇవ్వండి – శిక్షలు కాదు, శక్తినివ్వండి.
- విజయం చూపించండి – మార్కులు కాకపోయినా, మెరుగుదల కనబడాలి.
- పిల్లల మనసును మెప్పించే చదువు అలాగే వాళ్లే కోరుకునే అభ్యాసం కావాలి.
- మనం పిల్లల మీద ఒత్తిడి పెట్టడం తగ్గించాలి. వాళ్లలో ఉత్తేజాన్ని పెంచాలి. ??వీడియో గేమ్‌ల మాదిరిగానే – విద్య కూడా ఒక అడ్వెంచర్ అనిపించాలి.
- చదువు ఒక బాధగా, భారంగా కాదు ఒక ప్రయాణంగా మారితే – పిల్లలు కూడా చదువును "ఆటలా" ఆస్వాదిస్తారు. మొత్తానికి సమస్య స్క్రీన్ కాదు. చదువులో ఆనందాన్ని మేళవించడమే సమాధానం.

# ప్రసాదంపై జీఎస్టీ మినహాయింపు: ప్రకటించిన నిర్మలా సీతారామన్

**రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆర్థిక బిల్లు 2025పై చర్చ**

**ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు జీఎస్టీ వర్తించబోదని వెల్లడి**

**ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ/డిజిటల్ పన్నును రద్దు చేయనున్నట్లు వెల్లడి**



న్యూఢిల్లీ మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జీఎస్టీ నుండి ఆలయ ప్రసాదాలను మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై జరిగిన చర్చలో ఆమె ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు కీలక విషయాలను వెల్లడించారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలపై జీఎస్టీ వర్తించదని ఆమె స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులలో నెలకొన్న అనిశ్చితిని తొలగించే క్రమంలో ఆన్‌లైన్ ప్రకటనలపై విధిస్తున్న ఈక్వలైజేషన్ లెవీ/డిజిటల్ పన్నును రద్దు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇది కూడా ఒకటి.

# అమ్మాయిలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

## పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**సీతమ్మధారలో గల బాలికల పాపహోంలో విశాఖపట్నం గ్లోబల్ పింక్ ఆర్మీ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో పాపహోంలో ఆశ్రయం పొందుతున్న బాలికలు, అమ్మాయిల కోసం మహిళా సాధికారత, గైనిక్, యోగ మరియు ఇతర విషయాలపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.**

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాపహోం చైర్మన్ , నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చీ బాలికలను, అమ్మాయిలను ఉద్దేశించి ప్రసంగిస్తూ అమ్మాయిలు మరియు మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యాన్ని కోల్పోతే జీవించలేము కనుక వ్యాధికి సంబంధించిన వైద్యులను సంప్రదించి వైద్యులు ఇచ్చే సలహాలను, సూచనలను తప్పనిసరిగా పాటించి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు . ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన గ్లోబల్ పింక్ ఆర్మీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. బాలికలు మహిళల కోసం ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నట్టు గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ అధ్యక్షురాలు కొత్తపల్లి గీత తెలిపారు . ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వివిధ విభాగాలకు చెందిన వైద్యులు అమ్మాయిలకు సంపూర్ణ. ఆరోగ్యం పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించవలసిన నియమాలను తెలిపి బాలికలు మహిళలు స్వీయ రక్షణలో చేపట్టవలసిన చర్యలపై తగు సూచనలను సలహాలను తెలియజేశారు . కార్యక్రమంలో గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ శాఖ అధ్యక్షురాలు కొత్తపల్లి జ్యోతి యోగా గురువు డాక్టర్ రేణుక , డాక్టర్ దేవిశ్రీ , పాపహోం అధ్యక్షులు డి సూర్య ప్రకాశరావు , ఉపాధ్యక్షులు పి వెంకటేశ్వరరావు , కోశాధికారి రమేష్ చంద్ జైన్ , బాలికలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .




# ఫలిస్తున్న ప్రజాభాగస్వామ్య పోరాటం

**క్షయవ్యాధి (టీబీ)పై పోరులో భారత్ స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోంది. ఇటీవల విస్తృత స్థాయిలో 100 రోజులపాటు నిర్వహించిన 'టీబీ%-%ముక్త్ భారత్ అభి యాన్'... వినూత్న విధానాలను ప్రవేశ పెట్ట డమే కాక, జన బాహుళ్యాన్ని మమేకం చేయడం కూడా అంతే కీలకమని స్పష్టం చేస్తోంది. టీబీ కేసులను గుర్తించడాన్ని వేగవంతం చేయడం, మరణాలను తగ్గించడం, కొత్త కేసులను నివారించడం వంటి లక్ష్యాలతో 2024 డిసెంబర్ 7న ఈ ప్రచారం ప్రారంభమైంది.**



ఈ ప్రచారం ద్వారా టీబీ లక్షణాలు లేనివారే కాదు, ఆ లక్షణాలు గుర్తించని వారిని సైతం తొలిదశలోనే పసిగట్టి చికిత్స అందించింది. డయాబెటిస్ ఉన్నవారు, ధూమపానం చేసేవారు, మద్యపానం సేవించేవారు, హెచ్‌ఐవీ రోగులు, వృద్ధులు, తక్కువ 'బీఎమ్‌ఐ' ఉన్నవారు, టీబీ రోగులతో మసిలే కుటుంబ సభ్యులు... ఇలా అధిక రిస్కున్న వ్యక్తుల చెంతకు పోర్టబుల్ ఎక్స్%-%రే యంత్రాలను నేరుగా తీసుకెళ్ళి చికిత్స అందించడం జరిగింది.

కృత్రిమ మేధ సాయంతో పనిచేసే ఎక్స్%-%రేల ద్వారా అక్కడికక్కడే అనుమానిత టీబీ కేసులను గుర్తించారు. ప్రామాణికమైన 'న్యూక్లియిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్ట్' (ఎన్ఏఏటీ) ఉపయోగించి రోగ నిర్ధారణ కూడా జరిగింది. ఈ ప్రయత్నాలు అంటువ్యాధులను గుర్తించి త్వరగా చికిత్స చేయడానికీ, అవి వ్యాప్తి చెందకుండా అరికట్టడానికీ, ప్రాణాలను కాపాడటానికీ దోహదపడ్డాయి. దేశం నలుమూలలా చేపట్టిన ఈ ప్రచార కార్య క్రమంతో టీబీ బారిన పడటానికి అవకాశమున్న దాదాపు 12.97 కోట్ల మందికి పరీక్షలు జరిగాయి. తద్వారా సుమారు 7.19 లక్షల టీబీ రోగులను గుర్తించారు. ఇది కేవలం ఒక మైలురాయి అంటే సరిపోదు, ఒక మలుపు అనే చెప్పాలి.

### భాగస్వామ్య ఉద్యమం

చెప్పాలంటే... నిజమైన గేమ్ ఛేంజర్ కేవలం టెక్నాలజీ మాత్రమే కాదు%-% జనాలను సమీకరించడం (కమ్యూనిటీల సమీకరణ). టీబీ నిర్మూలన అనేది ఇప్పుడు 'జన్ భాగీదారీ' (ప్రజల భాగస్వామ్యం) ద్వారా నడిచే ఒక ప్రజా ఉద్యమంగా మారింది. దేశమంతటా 13.46 లక్షలకు పైగా 'ని%-%క్షయ్' శిబిరాలు జరిగాయి. ఇందులో గౌరవ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీఆర్లు, యూఎల్బీల ప్రతినిధులతో సహా 30,000 మందికి పైగా ఎన్నికైన ప్రతినిధులు 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'కు మద్దతు అందించారు. కార్పొరేట్ భాగస్వాములు, సాధారణ పౌరులు సైతం ఈ ప్రచారంలో పాల్గొన్నారు. టీబీ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సామూహిక లక్ష్యం అనే ఆలోచనను వీరు బలోపేతం చేశారు. ఈ మిషన్లో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ప్రజల భాగ స్వామ్యం ఉండటం విశేషం.

టీబీపై అవగాహన, న్యూట్రిషన్ కిట్ పంపిణీ, టీబీ రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేయడం వంటి 35,000కి పైగా కార్య కలాపాలను 22 వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు చేపట్టాయి. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలు, వాణిజ్య సంఘాలు, వ్యాపార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు 21,000కి పైగా కార్యకలాపాలను చేపట్టగా... 78,000 విద్యా సంస్థలలో 7.7 లక్షలకు పైగా విద్యార్థులు క్షయవ్యాధి అవగాహన కార్యకలాపాలలో పాల్గొన్నారు. జైళ్లు, గనులు, తేయాకు తోటలు, నిర్మాణ ప్రదేశాలు, పని ప్రదేశాల వంటి సామూహిక ప్రాంతాల్లో టీబీ బారిన పడటానికి అవకాశమున్న 4.17 లక్షలకు పైగా జనాలకు పరీక్షలు నిర్వహించారు.

'జన్ భాగీదారీ'కి పునాది వేసిన మన ప్రధాని దార్శనికత సమాజంపై విస్తృత ప్రభావాన్ని చూపింది. ఫలితంగా రోగులకు తగిన పోషకాహారాన్ని అందించడం కోసమే కాక, వారి మానసిక %-% సామాజిక స్థితిగతుల్లో తోడ్పాటుకు ఎంతోమంది ముందుకొచ్చారు. టీబీ రోగుల బాగోగులు ఇప్పుడు ఆసుపత్రులకు మాత్రమే పరి మితం కాలేదు. ఇది ఇంటింటికీ, గ్రామ గ్రామానికీ, పని ప్రదే శాలకూ వ్యాపించాయి.

'నిక్షయ్ మిత్ర' ద్వారా వ్యక్తులు, సంస్థలు ఇప్పటికే వేలాది ఆహార బుట్టలను పంపిణీ చేసి, టీబీ బాధిత కుటుంబాలకు పోషక సహాయాన్ని అందిస్తున్నాయి. కేవలం 100 రోజుల కార్యక్రమంలో 1,05,181 కొత్త నిక్షయ్ మిత్రులు నమోదయ్యారు. పోషకాహారం అందించడం, క్షయవ్యాధి నుంచి రోగులు కోలుకునేలా చేయడం మధ్య కీలక సంబంధాన్ని గుర్తిస్తూ... ప్రభుత్వం 'నిక్షయ్ పోషణ్ యోజన' కింద ఆర్థిక సహాయాన్ని నెలకు 800 నుంచి 1,000 రూపాయలకు పెంచింది. తద్వారా ఏ క్షయవ్యాధి రోగీ ఒంటరి పోరాటం చేయకుండా చూడటమే ప్రభుత్వ ఉద్దేశం.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కూడా విభిన్న రీతిలో టీబీ కేర్ ప్రోగ్రాం కింద రోగులకు అవసరమైన చర్యలు తీసుకోవడమే కాదు, రోగిని బట్టి శ్రద్ధ తీసుంటూ చికిత్సను అంది స్తోంది. ఉదాహరణకు, ఒక టీబీ రోగి తక్కువ బరువుతో ఉన్నట్లు తేలితే (18.5 కంటే తక్కువ బీఎమ్ఐ), వారి ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు తగిన పోషకాహారం, చికిత్స ప్రణాళికను రూపొందిస్తారు. చికిత్స సమయంలో నెల నెలా వారి పురోగతిని పర్యవేక్షిస్తారు.

### 100 రోజుల పురోగతి

క్షయ వ్యాధి పై అవగాహన కల్పించడం, రోజువారీ జీవితంలో సేవలను అందించే విషయంలో 22 మంత్రిత్వ శాఖలు చేతులు కలిపి ముందుకు సాగాయి. గోవా కార్నివాల్ పరేడ్‌లలో టీబీపై అవగాహన ఒక ప్రధానాంశంగా నిలిచింది. తమ కార్యాలయాలను సందర్శించే వేలాది మందికి ఉచిత టీబీ స్క్రీనింగ్‌లను చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్వహించింది. ఈ విభిన్న చర్యలు అపోహలను తొలగించే ప్రయత్నాలు చేశాయి. క్షయ నిర్మూలనలో ప్రజా చైతన్యానికి బాటలు పరిచాయి.

### 100 రోజుల ప్రచారం అనేది కేవలం ప్రారంభం మాత్రమే!

ప్రతి పౌరుడు... వారు ఎక్కడ నివసిస్తున్నారనే దానితో సంబంధం లేకుండా ఆధునిక పద్ధతుల్లో రోగనిర్ధారణ, నాణ్యమైన చికిత్స అందించడం, అన్ని వర్గాల వారినీ భాగస్వాములను చేయడం ద్వారా దేశవ్యాప్తంగా ఈ ప్రయత్నాలను వేగవంతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉంది. కోవిడ్%-%19 పరీక్షల విషయంలో ప్రభుత్వం ఎంత చురుగ్గా స్పందించిందో... అదే మాదిరి మరింత వేగవంతమైన, కచ్చితమైన అత్యాధునిక టీబీ పరీక్షలను అన్ని ప్రాంతాలకూ, అన్ని వర్గాలకూ అందుబాటులోకి తేవడానికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కృషి చేస్తోంది. స్వచ్ఛ భారత్ మిషన్ కావొచ్చు, పోలియో నిర్మూలన కార్య క్రమాలు కావొచ్చు... యావత్ సమాజం కదలి వస్తే ఎటువంటి ప్రయోజనాలు ఒనగూరుతాయో స్పష్టంగా రుజువు చేశాయి. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కూడా ఇప్పుడు ప్రజల నేతృత్వంలో మరో ఉద్యమంగా మారుతోంది. భారత్ ఇప్పుడు కేవలం క్షయవ్యాధితో పోరాడటం మాత్రమే కాదు%-% దాన్ని ఓడిస్తోంది కూడా!





డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

బుధవారం 26 మార్చి 2025


## సఖినేటిపల్లి లో కెనరా బ్యాంకు బ్రాంచ్ పనులు



**సఖినేటిపల్లి మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సఖినేటిపల్లి గ్రామంలో నూతనముగా కెనరా బ్యాంక్ బ్రాంచ్ని ఏర్పాటు చేయుటకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని మలికిపురం మండలం లక్కవరం లో కెనరా బ్యాంక్ ఫౌండర్ రుద్రరాజు గోపాలకృష్ణరాజు తెలిపారు.మంగళవారం సఖినేటిపల్లిలో గోపాలకృష్ణరాజు మాట్లాడుతూ సఖినేటిపల్లి సెంటర్లో మెయిన్ రోడ్డుకు చేర్చి ఉన్న 2 వేల చతురపు అడుగులు గ్రౌండ్ ఫ్లోర్ ఉన్న బిల్డింగు గాని,నూతనముగా నిర్మించి అద్దెకు ఇచ్చుటకు ఆసక్తి గలవారు వెంటనే కెనరా బ్యాంక్ అధికారులను సంప్రదించాలని గోపాల కృష్ణ రాజు తెలిపారు.

## ఓఎన్జిసి కార్యక్రమాలను స్తంభింపచేసిన ఓడలరేవు గ్రామస్తులు.....

**27న డిమాండ్లపై చర్చిదం ఓఎన్జిసి అధికారులు... సిఐ ప్రశాంత్ కుమార్ చొరవతో చర్చలు సఫలం**





**అల్లవరం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గతం నుండి ఎన్నో హామీలను ఇచ్చిన మాట నిలబెట్టుకొని ఓఎన్జిసి అధికారులు తమ డిమాండ్లను నెరవేర్చకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాలకైనా సిద్ధమన్న ఓడలరేవు గ్రామ మహిళలు వాచ్చరించారు.కనీసం గ్రామాన్ని దత్తత తీసుకుంటామని 10 సంవత్సరాల క్రితం హామీ ఇచ్చిన ఇప్పటికి కుడా పూర్తి స్థాయిలో తాగునిటి సరఫరా చేయలేకపోయారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు....చమురు సంస్థల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మంగళవారం ఓడలరేవు ఓఎన్జిసి కార్యకలాపాలను గ్రామస్తులు స్తంభింపచేశారు. ఆందోళనకారులు రోడ్డుపైనే బయటయించడంతో ఓఎన్జిసి ఉద్యోగులు వెను తిరిగిన వైనం.... ఉదయం నుండి అధిక సంఖ్యలో ఓఎన్జిసి టెరిమినల్ వద్దకు గ్రామస్తులు భారీగా చేరుకుని రోడ్డుపైనే వంటవార్పు నిర్వహించారు. అమలాపురం రూరల్ సి ఐ ప్రశాంత్ కుమార్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు సమక్షంలో ఆందోళనకారులు ఓఎన్జిసి అధికారులు చర్చలు జరిపారు. ఈ నెల 27 వరకు టైమ్ ఇవ్వాలని ఓఎన్జిసి అధికారులు గ్రామస్తులు కోరారు... స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లగా ఓఎన్జిసి అధికారులకు ఒక అవకాశం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు... నిరసన విరమించేది లేదని కార్యాలపాలు నిర్వహించుకోవచ్చని 27 వ తేదీ డిమాండ్ల పరిష్కార సమావేశం అనంతరం కార్యాచరణ తెలియజేస్తామని గ్రామస్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తాటిపాక ఏఎంసిని బి.సి శెట్టి బలిజలకు కేటాయించాలి

**రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ కు వినతి పత్రం**



**మలికిపురం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గత 60 సంవత్సరాలుగా రాజోలు నియోజకవర్గంలోని తాటిపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ సామాజిక వర్గంలోని శెట్టిబలిజ లకు కేటాయిస్తున్నారని ప్రస్తుత ప్రభుత్వంలో కూడా అదే కొనసాగించాలని రాజోలు నియోజకవర్గంలోని బీసీ సామాజిక వర్గంలోని శెట్టిబలిజి నాయకులు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శెట్టిబలిజ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఏఎంసీ చైర్మన్ పదవి వేరే సామాజిక వర్గానికి కేటాయిస్తున్నట్టు వార్తలు రావడంతో తాము స్పందించామన్నారు. తమ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి ఇచ్చి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ దొమ్మేటి ఉమామహేశ్వరరావు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్,గుబ్బల బాబ్జి, గుబ్బల మనోహరం,గుబ్బల శ్రీనివాస్,చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులు శిక్షణా తరగతులు...






**అల్లవరం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండలంలోని గోడిలంక ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీడిపిఓ వై. విజయ మంగళవారం తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయని బుధవారం ముగుస్తాయని సిపిడిఓ తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ భే, పడాయి బీ ఆదర్శ శీల, నవచేతన, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు వెంకటలక్ష్మి, ఎస్. కె. ఉన్నిషా, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

# రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ విజేత కలెక్టరేట్ టీమ్

## రన్నరప్ గా నిలిచిన అమలాపురం డివిజన్ టీమ్





**అమలాపురం, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అంబేద్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో కలెక్టరేట్ బృందం విజేతగా నిలిచింది. అమలాపురంలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో మూడు రోజులపాటు ఈ పోటీలు నిర్వహించారు. సోమవారం జరిగిన ఫైనల్లో కలెక్టరేట్ బృందం విన్నర్ కాగా అమలాపురం డివిజన్ బృందం రన్నర్ గా నిలిచింది. కలెక్టరేట్ బృందానికి కలెక్టరేట్ ఉద్యోగి కిషోర్ కెప్టెన్ గా వ్యవహరించగా అమలాపురం డివిజన్ బృందానికి శివ కెప్టెన్ గా వ్యవహరించారు. ఈ పోటీల్లో కిరణ్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా, బెస్ట్ బౌలర్ గా కృపాపాల్ వ్యక్తిగత బహుమతులు సాధించారు. విన్నర్స్ బృందంలో కిరణ్, శేషు, సుధీర్ కుమార్, రన్నర్స్ బృందంలో శివ, యాకూబ్, కళ్యాణ్ తదితరులు ఉన్నారు. వ్యాఖ్యాతగా ఎస్పీ భరత్ వ్యవహరించారు. జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ బౌలింగ్ వేసి అలరించారు. పోటీల అనంతరం ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ డిఆర్ఓ బిఎల్ రాజకుమారి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావుల పర్యవేక్షణలో ఈ క్రీడలు ఉత్సాహభరితంగా జరిగాయన్నారు. ఈ క్రికెట్ పోటీల్లో రెవెన్యూ ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో క్రికెట్ క్రీడలో పాల్గొని ప్రతిభను చాటారన్నారు. భవిష్యత్తులో మరింత పోటీతత్వంతో క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించడానికి, మానసిక ఉల్లాసాన్ని పొందడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని చాటుకోవడానికి ఈ చక్కటి వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో గెలుపు ఓటమిలు సహజమని ఓటమి గెలుపుకు నాందన్నారు.





# రెవెన్యూ రికార్డుల నిర్వహణలో ప్రథమ స్థానంలో నిలవాలి

## - జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి

**అమలాపురం, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భూ పరిపాలన వ్యవహారాలు చూసే అతి ముఖ్యమైన వ్యవస్థ రెవెన్యూ వ్యవస్థని ఈ వ్యవస్థలో జవాబుదారితనం అంకితభావం నిబద్ధతతో పనిచేస్తూ రెవెన్యూ రికార్డులు నిర్వహణలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం అమలాపురం కలెక్టరేట్ లో రెవెన్యూ ఉద్యోగులకు ఆమె శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. భూ పరిపాలన అంశాల ఫైలింగ్ నిర్వహణ విధి విధానాల పట్ల పరిపూర్ణమైన అవగాహనను పెంపొందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సాంకేతికతను జోడిస్తూ రిపోర్టులు పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం చేసే భూమి సేకరణకు ఈ రికార్డులే ఆధారమన్నారు. భూ రికార్డులు, పన్ను రికార్డులు, ఆస్తి రికార్డులు ఇతర సంబంధిత





పత్రాలను నిర్వహించే ప్రక్రియ రెవెన్యూ శాఖ ముఖ్యమైన బాధ్యతని ఇది పౌరులకు ప్రభుత్వానికి ముఖ్యమైన సమాచారాన్ని అందిస్తుందన్నారు. గ్రామ స్థాయి వీఆర్వో నుంచి కలెక్టరేట్ వరకు రెవెన్యూ సంబంధిత నివేదికలు సకాలంలో స్పష్టతతో రికార్డులు రూపొందించి సమర్పించాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి భూ సమస్యలపై సంబంధిత తహసిల్దార్లు, ఆర్డీవోలు విచారించి రిమార్కులతో కలెక్టరేట్ సమర్పించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని తద్వారా సమాచారం ఖచ్చితంగా ఉంటుందన్నారు. డిఆర్ఓ బి.ఎల్.ఎన్.రాజకుమారి మాట్లాడుతూ భూ పరిపాలన, ఎన్నికల నిర్వహణ, కోర్టు కేసుల పరిష్కారం అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని సమన్వయంతో మెరుగైన సేవలను అందించాలన్నారు. కలెక్టరేట్ పరపాలనాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు ప్రతి సీటుకు సంబంధించి ఉద్యోగుల జాబ్ ఛార్ట్ ప్రకారం నిర్వహించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్లు శివరాజ్, రమణకుమారి ఉప తహసిల్దార్లు వంశీ, ఏసుబాబు, సిబ్బంది భరత్ తదితరులు పాల్గొన్నారు.


## 25 మంది పురోహితులకు 25 కేజీల చొప్పున బియ్యం అందజేత



భీమవరం, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మానవసేవయే మాధవసేవ అని, తోటివారికి సహాయం చేయడం భగవత్ సేవతో సమానమని ప్రముఖ సినీ దర్శకులు కృష్ణవంశీ (శ్రీ ఆంజనేయం ఫేమ్ ) అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి మందిరంలో అల్లం రమేష్, వాణి దంపతుల 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా 25 దేవాలయాల పురోహితులకు 25 కేజీల చొప్పున 25 బస్తాల బియ్యం (625 కేజీలు) ను కృష్ణవంశీ చేతుల మీదుగా అందించారు. అయన మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని, సమాజ సేవ చేయడం నైతిక బాధ్యత అని అన్నారు. మందిర అధ్యక్షులు కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ పట్టణానికి చెందిన అల్లం రమేష్ దంపతుల సహకారంతో 25 మంది పురోహితులకు 25 కేజీల చొప్పున 25 బియ్యం బస్తాలను, నిత్యావసర సరుకులను అందించామని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కుక్కల బాల, సరిపిడకల రామారావు, జనపాటి మధుసూదన్ రావు, శ్రీనివాసాచార్యులు, కడలి వెంకటేశ్వరరావు, కడలి ఫణి, మహిళలు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకల బ్రోచర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలు పండుగలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఈనెల 30న భీమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరిగే ఉగాది పురస్కార వేడుకల బ్రోచర్ ను మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు భవితరాలకు తెలియజేస్తూ గత 40 ఏళ్లుగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉగాది వేడుకల కమిటీ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థలలో విశేష సేవలందిస్తున్న వారికి ఉగాది పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు. కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పళ్ళ ఏసుబాబు, కారుమూరి సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మిని స్టేట్ బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఏప్రియల్ 4న భీమవరంలో జరిగే మిని స్టేట్ బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్ ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించారు. జిల్లా బాడీ బిల్డింగ్ జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజర్ వలవల ఫణి మాట్లాడుతూ ఏప్రియల్ 4న భీమవరం టౌన్ హాల్లో 55, 60,65,70,75,80,85 కేజిల కేటగిరిలో పోటీలు జరుగుతాయని, ఛాంపియన్ అఫ్ ఛాంపియన్ కు రూ 25 వేలు ప్రైజ్ అందిస్తామని, అన్ని కేటగిరిలోని మొదటి మూడుస్థానంలోని విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ వైస్ ప్రెసిడెంట్ పత్తి సురేష్, జిల్లా ప్రెసిడెంట్ కఠారి రవిశంకర్, సెక్రటరీ షేక్ ఖాసీం, ట్రెజరర్ ఎం వాసు, పెంటకోటి శ్రీను, ఎస్కె హస్సి, వై ఉపేంద్ర, ఏసు ప్రకాష్, టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరావు, పొత్తూరి బాపిరాజు, టౌన్ హల్ అధ్యక్షులు కోళ్ల రామచంద్రరావు, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకున్న దర్శకులు కృష్ణవంశీ

భీమవరం, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ప్రముఖ సినీ దర్శకులు కృష్ణవంశీ (శ్రీఆంజనేయం ఫేం) భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో దర్శకులు కృష్ణవంశీని శాలువా కప్పి అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, సరిపిడకల రామారావు, అల్లం రమేష్, జనపాటి మధు సుధన్ రావు, రంగసాయి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి

# రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయండి.

ఏలూరు, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



లూరు పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి కీలకమైన రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు మంగళవారం అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదిక సమర్పించారు. భద్రాచలం - కోవ్వూరు బ్రాడ్ గేజ్ లైన్ (సత్తుపల్లి మార్గంగా) నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని..గుడివాడ జంక్షన్ - నూజివీడు - మధిర కొత్త రైల్వే లైన్ (నూజివీడు పట్టణం, విస్సన్నపేట మార్గంగా) నిర్మాణం.. నూజివీడు రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధుల విడుదల %-% ముఖ్యంగా ప్రయాణీకుల నిరీక్షణ గదులు, మండపాలు, మరుగుదొడ్లు, ఎత్తు లిఫ్టులు, కూర్చునే బెంచీలు మరియు 24 గంటల టికెటింగ్ కౌంటర్ ఏర్పాటు.. ఏలూరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న గేట్లు కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నందున ఎన్.హెచ్-16 పై రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం.. ప్రధాన రైల్వే స్టేషన్లలో కోవిడ్ సమయంలో ఉన్న రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించడం, ముఖ్యంగా పల్లేవాడ హాల్ట్, నూజివీడు స్టేషన్‌లకు మరింత ఎక్కువ స్టాప్‌లను కేటాయించాలని ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ ప్రాజెక్ట్ కింద ఆంధ్రప్రదేశ్‌లో 73 రైల్వే స్టేషన్లు అభివృద్ధికి ఎంపిక చేసి, వీటి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రైల్వే వ్యవస్థ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ఏలూరు వ్యవసాయ కేంద్రంగా ఉన్నందున రవాణా సౌకర్యాలు మెరుగుపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో త్వరగా మార్కెట్‌కు తరలించి గిట్టుబాటు ధర పొందడానికి వీలుందని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. నేషనల్ రైల్ ప్లాన్' కింద 2030 నాటికి భారత రైల్వేలను 'భవిష్యత్ సిద్ధంగా' ఉంచే లక్ష్యంతో చేపట్టిన సంస్కరణలు దేశానికి మెరుగైన కనెక్టివిటీని అందించడంతో పాటు ఆర్థిక వృద్ధి, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు అత్యంత కీలకమైన పరిణామం అని, రాష్ట్రంలోని పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు మరింత ఉపకరిస్తుందని, ముఖ్యంగా వాల్తేరు డివిజన్‌ను కొత్త జోన్‌లో భాగంగా కొనసాగించాలని తీసుకున్న నిర్ణయం రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడంలో సహాయపడుతుందని, గత పది సంవత్సరాలుగా ప్రజలు ఎంతగానో ఎదురుచూసిన ఈ డిమాండ్ నెరవేర్చి ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నం సహకారం చేసినందుకు ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మరొక ముఖ్యమైన ప్రాజెక్ట్ అమరావతి రైల్వే లైన్ మంజూరు చేయడం వల్ల రాష్ట్ర రాజధాని అమరావతిని దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాలు, సముద్ర తీర ప్రాంతాలతో అనుసంధానిస్తుందని, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు, పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతుందని ఎంపీ మహేష్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు రైల్వే వ్యవస్థ వెన్నెముకవంటిదని, దేశ వ్యాప్తంగా సరుకులు ప్రయాణికులను సమర్థవంతంగా తరలించే కీలక వ్యవస్థగా ఉన్న రైల్వే ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు విస్తృత చర్యలు చేపట్టడాన్ని తాను స్వాగతిస్తున్నట్లు ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో భారతీయ రైల్వేలకు రూ. 2,55,445 కోట్లు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని, రైల్వే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే కేంద్ర ప్రభుత్వం నిబద్ధతకు అద్దం పడుతుందని ఎంపీ మహేష్ కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు.


## చలివేంద్రంను ప్రారంభించిన బడేటి చంటి

ఏలూరు, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాలను శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య,మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం వేసవికాలం ప్రారంభం నుండే ఎండలు ఎక్కువగా ఉన్నాయి అన్నారు. ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరంగా ఏలూరు నగరంలోని జనసంచారం ఎక్కువగా ఉండే 7 ప్రధానమైన ప్రాంతాల్లో కూలింగ్ వాటర్ చలివేంద్రాలను ఈరోజు ప్రారంభించడం జరిగిందన్నారు.వాటిలో ఫైర్ స్టేషన్ సెంటర్ బిర్లాభవన్ సెంటర్లోని చలివేంద్రాలను శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య,మేయర్ మేయర్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు. వన్ టౌన్ ప్రాంతంలోని బిర్లా భవన్ సెంటర్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. టూ టౌన్ ప్రాంతంలోని ఫైర్ స్టేషన్ సెంటర్,కలెక్టర్ కార్యాలయంవద్ద,జూట్ మిల్ వద్ద ఏర్పాటు చేశారని.అదేవిధంగా ఆర్ఆర్ పేట పార్కు మరియు పాత బస్టాండ్ లో డైరెక్ట్ గా వాటర్ కూలర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ వారు ముందస్తుగానే హెచ్చరికలు జారీ చేయడం జరిగిందని.పిల్లలకు స్కూలు సెలవులు ఇచ్చినప్పటినుండి మధ్యాహ్నం పూటలు రోడ్లమీద తిరగనివ్వకుండా పెద్దవాళ్లు బాధ్యతగా చూసుకోవాలన్నారు. పెద్ద వాళ్ళు ముసలి వాళ్లు మార్కెట్ పనులు ఏమైనా ఉంటే ఉదయం సాయంత్రం పూటలు చూసుకోవాలన్నారు.అదేవిధంగా బస్టాండ్లు వద్ద,మార్కెట్ ఏరియా,ప్రజలు రద్దీగా ఉండే ప్రధాన ప్రాంతాల్లో మజ్జిగ,మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని శాసనసభ్యులు బడేటి చంటి,మేయర్ నూర్జహాన్ పెదబాబు కోరారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ భాను ప్రతాప్,సురేంద్రబాబు,డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు,వందరానీ దుర్గాభవాని శ్రీనివాస్,కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం,కార్పొరేటర్లు గూడూరి ఆదిలక్ష్మి ప్రసాద్,వంకదారు ప్రవీణ్,జిన్నూరు కనక నరసింహారావు,దేవరకొండ శ్రీనివాసరావు,పాము శామ్యూల్,ఈదుపల్లి పవన్,ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు,మారం అను తదితరులు పాల్గొన్నారు

## మినీ కాన్ఫరెన్స్ హాల్ ను ప్రారంభించిన బడేటి చంటి




ఏలూరు, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నూతన హంగులతో రీ మోడల్ చేసిన మినీ కాన్ఫరెన్స్ హాల్ను ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య,నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బడేటి చంటి మాట్లాడుతూ కాన్ఫరెన్స్ హాలు ఎంతో సుందరంగా ఉందన్నారు. అయితే ప్రజాప్రతినిధులందరూ వారి డివిజన్లను కాన్ఫరెన్స్ హాల్ ఉన్నంత సుందరంగా తయారు చేయాలన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి ప్రజలు రోడ్లు,డ్రైన్లు సమస్యల గురించి మన వద్దకు రాకుండా చూసుకోవాలన్నారు. మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ. గతంలో కౌన్సిల్ హాల్ ఇప్పుడు నూతన హంగులతో కాన్ఫరెన్స్ హాల్ గా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ఏడు పంచాయతీలు విలీనం కావడంతో కార్పొరేషన్ లో జనాభా పెరగడం.అధికారులు సిబ్బంది పెరగడం జరిగిందన్నారు. కార్పొరేషన్ లో ఉన్న 7 సెక్షన్ల అధికారులు,సిబ్బంది,అంతేకాకుండా సచివాలయాలకు సంబంధించిన సిబ్బందితో ఎప్పటికప్పుడే రివ్యూలు నిర్వహించుకోవడానికి ఈ మినీ కాన్ఫరెన్స్ హాల్ ఉపయోగించడం జరుగుతుందని మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ హాల్ ఎంతో సుందరంగా తీర్చిదిద్దిన కాంట్రాక్టర్ మాలిక్ అతని కుమారుడు అమీర్లను నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు బొకే ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ భాను ప్రతాప్, అదనపు కమిషనర్ జి. చంద్రయ్య, ఎం ఈ సురేంద్రబాబు,డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు,వందరానీ దుర్గాభవాని శ్రీనివాస్,కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, జాల సుమతి బాలాజీ, కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్,జిన్నూరు కనక నరసింహారావు,దేవరకొండ శ్రీనివాసరావు,కల్వకొల్లు సాంబ,అర్జీ సత్యవతి నాగేశ్వరరావు, పాము శామ్యూల్,ఈదుపల్లి పవన్,బత్తిన విజయకుమార్,సబ్బన శ్రీనివాసరావు,జనపరెడ్డి కృష్ణతదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ప్రయోగాలతో విజ్ఞానాభివృద్ధి

### రేవతి ఫౌండేషన్ ఫౌండర్ కె.కృష్ణ సాయి.



మలికిపురం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



సైన్స్ ప్రయోగాలతో విద్యా నా అభివృద్ధి చెందుతుందని,పాఠ్యపుస్తకాలలో ఉన్న ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి చూపించడం వలన విద్యార్థులతో సైన్స్ పై ఆసక్తి ని పెంపొందించవచ్చుని రేవతి సైన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.కృష్ణ సాయి అన్నారు.డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం లోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల లో సైన్స్ ప్రయోగాల కార్యశాల నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.కృష్ణ సాయి విద్యార్థుల కు వివిధ సైన్స్ ప్రయోగాలను చేసి చూపించి విద్యార్థులలో సైన్స్ పై ఆసక్తి ని పెంపొందించారు.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ పి.వి.వి వర ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ ప్రయోగాలను గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు సైతం అందుబాటులో కి తెస్తూ వారిలో సైన్స్ టెంపర్ ను పెంచేందుకు కృషి చేస్తు న్న కృష్ణ సాయి ని అభినందించారు.ప్రతీ విద్యార్థి పరిశీలనాసక్తిని పెంపొందించు కోవాలని,సైన్స్ ప్రయోగాలతో అభివృద్ధి ని సాధించవచ్చుని ప్రసాద్ అన్నారు.ఈ సందర్భంగా కృష్ణ సాయి ని జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు సిహెచ్ తులసీరావు,పాఠశాల కరెస్పాండంట్ పి.వి.వి.వర ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా దుశ్శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రావులపాలెం విద్యార్థులు

రావులపాలెం, మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



రావులపాలెం శ్రీ స్వామి వివేకానంద యోగా ఆశ్రమం ఆశ్రమంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు యోగా గురువు డాక్టర్ యోగా శ్రీనివాస్ తెలిపారు. మార్చ్ 9వ తేదీన కొత్తపేటలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల నుంచి సుమారు వందమంది విద్యార్థులుఈ యోగా పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. ఈ పోటీల్లో రావులపాలెం యోగా ఆశ్రమంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఆర్.లావణ్య, టి.పూజిత, ఎం. అనుదీప్తి, ఎన్. గ్రీష్మ భార్గవి, ఏ. శశిశ్రీ ,కే.సత్య గంగాభవానిలు ప్రతిభ కనబరిచి ఈనెల 28వ తేదీన విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 71 వినతులు

**అదనపు కమీషనరు డి.వి.రమణమూర్తి**



విశాఖపట్నం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కు 71 వినతులు వచ్చాయని అదనపు కమీషనరు డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.**

ఈ సందర్భంగా అదనపు కమీషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 71 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 06, 3వ జోన్ కు 15, 4వ జోన్ కు 05, 5వ జోన్ కు 09, 6వ జోనుకు 18, 7వ జోనుకు 01, 8వ జోన్ కు 10, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 06 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి రెవెన్యూ విభాగమునకు 10, ప్రజారోగ్య విభాగమునకు 01, పట్టణ ప్రణాళిక విభాగమునకు 37, ఇంజినీరింగు విభాగమునకు 19, మొక్కల విభాగమునకు 01, యు.సి.డి విభాగానికి 03 కలిపి మొత్తంగా 71 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనరు మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ పి.శివ ప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, ఎఫ్ ఎ.ఒ మల్లికాంబ, డిడిహెచ్ ఎం.దామోదర్ రావు, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్లు క్రిష్ణారావు, గోవిందరావు, సత్యనారాయణ రాజు, సంపత్ కుమార్, పి.ఒ. డి.లక్ష్మి, డి.పి.ఒ. ఎం.వి.డి. ఫణిరామ్, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్టు సాంబమూర్తి , డిసిపి హరిదాస్,ఎసిపిలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సుకత వ్యక్తి ప్రగతికి చోదక శక్తి

**జీవితం రసాయన శాస్త్ర మిళితం**

**ఎం.ఎన్.శాస్త్రి స్మారక ఉపన్యాస నిర్వహణ**



విశాఖపట్నం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ఉత్సుకత వ్యక్తి ప్రగతికి ప్రేరణ శక్తిగా నిలుస్తుంది అని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి - కాన్పూర్) రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఎం. లక్ష్మీనారాయణ రావు అన్నారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం్ రసాయన శాస్త్ర విభాగంలో ఆచార్య ఎం.ఎన్. శాస్త్రి స్మారక ఉపన్యాసాన్ని ఆయన అందించారు. ముందుగా ఆచార్య ఎం.ఎన్. శాస్త్రి చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు.**

అనంతరం ఆచార్య లక్ష్మీ నారాయణ ద థ్రిల్ ఆఫ్ క్యూరియాసిటీ డ్రివెన్ సైన్స్ రీసెర్చ్ అండ్ సస్టైనబుల్ ఆర్గానిక్ సింథసిస్ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆచార్య లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మానవ జీవితం, ప్రకృతి అంతా రసాయన శాస్త్ర సమ్మేళనమని పలు ఉదాహరణలతో వివరించారు. మన ఆలోచన విధానాన్ని ఉన్నత స్థితి దిశగా తీసుకువెళ్లే శక్తి క్యూరియాసిటీ కి ఉందన్నారు. నూతన అంశాలను నేర్చుకోవాలని తపన, జిజ్ఞాస విద్యార్థులు ఎల్లవేళలా కలిగి ఉండాలని సూచించారు. అవకాశాలను సరైన సమయంలో వేగంగా అందిపుచ్చుకోవడం అవసరమని, అదే సమయంలో నైతికత, విలువలకు ప్రాధాన్యత ఇస్తూ వీటిని అందుకోవాలని సూచించారు. గ్రీన్ ఆర్గానో మెటాలసిస్ అంశంపై ఆయన ప్రసంగించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ ఆచార్య ఎం.ఎన్ శాస్త్రి స్మారక ఉపన్యాసం నిర్వహించడం, ఈ కార్యక్రమం ఏర్పాటుకు విభాగం చొరవ తీసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తు చేసుకోవడం, నేటితరం యువతకు వీరిని పరిచయం చేయడం వీరి పరిశోధనలు, విశిష్టతను తెలియజేయడం ముదావహమని చెప్పారు. విశిష్ట పరిశోధకులుగా పరిపాలనదక్షుడిగా జాతీయస్థాయిలో అవార్డులను పొందిన ఆచార్య ఎం.ఎన్ శాస్త్రి జీవితం నేటి తరం యువతకు స్ఫూర్తిని కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఎం. లక్ష్మీనారాయణ రావు ని ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున సత్కరించి జ్ఞాపిక బహుకరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి. గిరిజ శంకర్, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, రీసెర్చ్ డెవలప్మెంట్ డీన్ ఆచార్య కె. బసవయ్య, విభాగాధిపతి ఆచార్య శ్యామల, విభాగాచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు.. జేపీసీ గడువు పొడిగింపు




**ఢిల్లీ: జమిలి ఎన్నికల కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ కాల పరిమితిని పెంచేందుకు లోక్‌సభ అంగీకరించింది. భాజపా ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది.**

వర్షాకాల సమావేశాల చివరివారంలో తొలి రోజు వరకు గడువు పొడిగించింది. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటైంది.

దీనిలో లోక్‌సభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. అయితే.. ఈ కమిటీ కాలపరిమితి వచ్చేనెల 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలివుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంపై పలువురు న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిగాయి. ఇప్పటికే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రఖ్యాత న్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, దిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి.షాలు కమిటీ ముందు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారు. జేపీసీ గడవు పొడిగించే తీర్మానానికి లోక్‌సభ తాజాగా ఆమోదం తెలిపింది.

# 92వ వార్డులో ఉచిత వైద్య శిబిరం



విశాఖపట్నం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**జీవీఎంసీ 92వ వార్డు పరిధి వెంకటపురంలో ఎల్జీ పాలిమర్స్ సౌజన్యంతో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు గణబాబు ప్రారంభించారు.**

ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన ఎల్జీ పాలిమర్స్ యాజమాన్యాన్ని, ఇండస్ హాస్పటల్ ప్రతినిధులను, వైద్యులను ఎమ్మెల్యే గణబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్కాపురంలో 'పోషన్ భీ - పడాయ్ భీ'

# శిక్షణా తరగతులు ప్రారంభం



గాజువాక మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ములగాడ మండలం పరిధి మల్కాపురంలో స్థానిక అంగన్ వాడీ కార్యకర్తలకు సోమవారం 'పోషన్ భీ – పడాయ్ భీ' కార్యక్రమంపై శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి.**

మార్చి 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు (మూడు రోజులు) జరిగే ఈ శిక్షణా తరగతులలో లక్ష్యాలు, బాల్యారంభ సంరక్షణ, విద్యా ప్రాముఖ్యత, ఆదర్శిలా అనగా 3 నుండి 6 సంవత్సరాల పిల్లలలో సమగ్ర అభివృద్ధిని సాధించడం, నవచేతన అనగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మూడు సంవత్సరాల పిల్లలు వరకు వాళ్ళ సమగ్ర అభివృద్ధి సాధించడం అలాగే ఏ కార్యక్రమాలు ఏ అభివృద్ధికి ఉపయోగపడతాయి,

టీచింగ్ - లెర్నింగ్, ఎయిడ్స్ ప్రాముఖ్యత తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఎస్ వరలక్ష్మి, వెన్నిసా సుందరీలు అవగాహన కల్పించనున్నారు. విశాఖపట్నం జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఎంవీ రమణకుమారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఎంఈఓ - 1, ఎంఈఓ - 2 తదితరులు పాల్గొన్నారు.

## గాదిరాయి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో

# ఐదుగురికి గాయాలు



విశాఖపట్నం మార్చి 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**మాడుగుల మండలంలోని ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఘాట్ రోడ్ సెంటర్ నుండి గాదిరాయి గ్రామం వెళు తున్న ట్రాలీ లారీ డ్రైవర్ పాకలపాటి పవన్ కుమార్ అజాగ్రత్తగా లారీని నడుపుతూ ఎదురుగా వస్తున్న మూడు ద్విచక్ర వాహనాలను బలంగా గుద్దడంతో ద్విచక్ర వాహనాలపై వస్తున్న ఐదుగురికి రక్త గాయాలయ్యాయి. దీంతో బాధితులను ఎన్టీఆర్ హాస్పిటల్ కి తరలించి వైద్యం అందించారు. ద**

ద్విచక్ర వాహనాలపై గాయపడిన వారిలో మాడుగుల గొటివాడ అగ్రహారం గ్రామానికి చెందిన మాడిసి ఎర్రి నాయుడు, పల్లా అప్పారావు, చీడికాడ మండలం చిట్టి పల్లి గ్రామానికి చెందిన కాకర కొండబాబు కాకర కొండ అమ్ములు చోడవరం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్ల పల్లవి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ నారాయణరావు తెలిపారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
మార్చి 26, బుధవారం 2025


# ఢిల్లీపై ఓటమితో పంత్‌కి వార్నింగ్ ఇచ్చిన లక్నో ఓనర్?

ఐపీఎల్ 2024లో లక్నో సూపర్ జెయింట్స్ తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోవడంతో యాజమాని సంజీవ్ గోయెంకా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కెప్టెన్ రిషబ్ పంత్‌తో పాటు కోచ్ జస్టిన్ లాంగర్‌తో కూడా సీరియస్‌గా మాట్లాడినట్లు తెలుస్తోంది. గత సీజన్‌లో కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై ఒత్తిడి పెంచిన గోయెంకా, ఇప్పుడు పంత్‌ను కూడా అదే పరిస్థితిలోకి నెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. యాజమాన్యం తరచుగా ఆటగాళ్లపై ఒత్తిడి పెంచడం వల్ల జట్టు విజయం సాధించలేకపోతుందనే అభిప్రాయం నెటిజన్లలో వ్యక్తమవుతోంది.



ఐపీఎల్‌లో ఆటగాళ్లు ఎంత ప్రెజర్‌లో ఉంటారో అందరికీ తెలిసిందే. కానీ ఒక్కో ఫ్రాంచైజీ యాజమాన్యం వారి టీమ్‌ను ఎలా హ్యాండిల్ చేస్తుందనేది కీలకం. కొన్ని జట్లు తమ ఆటగాళ్లపై పూర్తి నమ్మకం ఉంచి ప్రోత్సహిస్తే, మరికొన్ని ఫ్రాంచైజీలు ఓటమిని జీర్ణించుకోలేక ఆటగాళ్లపై ఒత్తిడి పెంచుతాయి. లక్నో సూపర్ జెయింట్స్ యాజమాని సంజీవ్ గోయెంకా రెండో వర్గంలోకే వస్తారు. గత సీజన్‌లో కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై అసంతృప్తిగా ఉన్న గోయెంకా, ఈసారి అదే పరిస్థితిని రిషబ్ పంత్‌కు తీసుకువచ్చారని చెప్పుకుంటున్నారు.

### ఓటమితో యాజమాని అసహనం

లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌ను ఓటమితో ప్రారంభించింది. తమ తొలి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో 1 వికెట్ తేడాతో పరాజయం పాలైంది. అయితే ఆ మ్యాచ్‌లో గెలుపు చివరి వరకు లక్నో వైపే ఉంది. కానీ అశుతోష్ శర్మ (31 బంతుల్లో 66 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్ ఆడడంతో గెలుపు ఢిల్లీకి చేజారింది. ఈ ఓటమిని జీర్ణించుకోలేని లక్నో యజమాని సంజీవ్ గోయెంకా, కెప్టెన్ రిషబ్ పంత్‌ను పిలిచి సీరియస్‌గా మాట్లాడినట్లు వీడియోలు బయటకొచ్చాయి. అంతేకాదు, కోచ్ జస్టిన్ లాంగర్‌తో కూడా గంభీరంగా చర్చించినట్లు కనిపించింది.

### గతంలా ఇప్పుడు కూడా?

గత సీజన్‌లో కూడా గోయెంకా టీమ్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పట్లో కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై నేరుగా అసహనం వ్యక్తం చేస్తూ, అతన్ని పబ్లిక్‌గా విమర్శించారు. ఇప్పుడు అదే తీరు రిషబ్ పంత్ విషయంలోనూ కనబడుతుండటంతో లక్నో జట్టులో మళ్లీ అదే పరిస్థితి ఏర్పడనుందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. గతంలో రైజింగ్ పూణె సూపర్ జెయింట్స్ యజమానిగా ఉన్నప్పుడు గోయెంకా ధోనీని కెప్టెన్సీ నుంచి తప్పించి స్టీవ్ స్మిత్‌ను నియమించిన విషయం కూడా గుర్తుచేస్తున్నారు.

### యాజమాన్యం తీరు మారాలని సూచనలు

ఒక ఫ్రాంచైజీకి మంచి ఆటగాళ్లు, మంచి యాజమాన్యం రెండూ కీలకం. కానీ లక్నో యాజమాన్యం తరచుగా ఆటగాళ్లపై ఒత్తిడి పెంచడం వల్ల జట్టులో అసంతృప్తి పెరుగుతుందని అభిమానులు అంటున్నారు. కేవలం ఓటమికి ఒక ఆటగాళ్లను బాధ్యులుగా భావించకుండా, మేనేజ్‌మెంట్ సపోర్ట్ అవసరమని నెటిజన్లు సూచిస్తున్నారు. లక్నో యాజమాన్యం తమ తీరు మార్చుకోకపోతే, జట్టుకు మంచి ఫలితాలు రావడం కష్టమని అంటున్నారు.

# CSKతో మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ ఆడతాడా?



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్ కుమార్ తిరిగి బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాడు. మార్చి 28న చెన్నైలోని MA చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో భువి ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్వల్ప గాయంతో IPL 2025 మొదటి మ్యాచ్‌కు దూరమైన ఈ సీనియర్ బౌలర్, ఇప్పుడు తన ఫ్రాంచైజీ తరఫున అరంగేట్రం చేయడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. మార్చి 24న RCB అధికారిక సోషల్ మీడియా ద్వారా భువనేశ్వర్ పునరాగమనం గురించి బలమైన సంకేతం ఇచ్చింది. ఫ్రాంచైజీ తన బౌలర్ల చిత్రాన్ని పోస్ట్ చేసి, "భువి ఎప్పటికన్నా త్వరగా, ధైర్యంగా తిరిగి చర్యలోకి దిగుతాడు!" అంటూ క్యాప్షన్ జోడించింది.

భువి IPLలో అపార అనుభవం కలిగిన పేసర్. ఇప్పటివరకు 176 మ్యాచ్‌లు ఆడి, 7.56 ఎకానమీ రేటుతో 181 వికెట్లు పడగొట్టాడు. అతని రి-ఎంట్రీ RCB బౌలింగ్ విభాగానికి గణనీయమైన బలాన్నిస్తుంది. ముఖ్యంగా పవర్‌ప్లే ఓవర్లలో భువి అదిరిపోయే స్వింగ్ బౌలింగ్‌ను అందించగలడు. ఇది CSK వంటి శక్తివంతమైన బ్యాటింగ్ లైనప్‌ను ఎదుర్కొనడానికి RCBకి అనుకూలంగా మారొచ్చు. భువనేశ్వర్ గైర్హాజరీలో, యువ జమ్మూ & కాశ్మీర్ పేసర్ రసిఖ్ సలాం ఆడే అవకాశం పొందాడు. అతను కొంచెం రన్స్ లీక్ చేసినప్పటికీ, మూడు ఓవర్లలో 35 పరుగులు ఇచ్చి, 10వ ఓవర్లో సునీల్ నరైన్ కీలకమైన వికెట్‌ను తీసి విలువైన బ్రేక్‌థ్రూ అందించాడు.

ఇదే సమయంలో, ఆస్ట్రేలియన్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ నాలుగు ఓవర్లలో 2/22 వికెట్లు తీసి తన ప్రతిభను చాటాడు. యష్ దయాల్ మూడు ఓవర్లలో 25 పరుగులు ఇచ్చి స్లాగ్ ఓవర్లలో ఒక వికెట్ తీసుకున్నాడు. ఈ ప్రయత్నాలు కలిసి కోల్‌కతా నైట్ రైడర్స్‌ను 174/8కే పరిమితం చేశాయి. ఈ లక్ష్యాన్ని RCB 16.2 ఓవర్లలోనే ఛేదించి సులభ విజయాన్ని సాధించింది.

భువనేశ్వర్ తిరిగి రావడం RCB బౌలింగ్ దళానికి అదనపు బలాన్ని ఇస్తుంది. పవర్‌ప్లేలో వికెట్లు తీయగల గుణం, అనుభవం, డెత్ ఓవర్లలో క్రమశిక్షణగల బౌలింగ్ చేయగల సామర్థ్యం భువిని విలువైన ఆటగాడిగా నిలబెడతాయి. RCBకి ఇది పెద్ద మార్పుగా మారొచ్చు, ముఖ్యంగా CSK వంటి పటిష్టమైన బ్యాటింగ్ లైనప్‌ను ఎదుర్కొనేటప్పుడు.

మార్చి 28న చెన్నైలో జరగనున్న ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ మళ్లీ తన ప్రతిభను నిరూపించుకోగలడా? లేదా CSK బ్యాట్స్‌మెన్లు అతనిపై ఆధిపత్యం ప్రదర్శించగలరా? అనే ఉత్కంఠకు వీరాభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# గుజరాత్, పంజాబ్ ప్లేయింగ్ 11

## స్టార్ ఆటగాడికి చోటు కష్టమే!

ఐపీఎల్ 2025లో భాగంగా ఈరోజు గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రాత్రి 7.30కు మ్యాచ్ ఆరంభం కానుంది. ఈ సీజన్లో గుజరాత్, పంజాబ్ జట్లకు ఇదే మొదటి మ్యాచ్. ఈ నేపథ్యంలో విజయంతో టోర్నీని ఆరంభించాలని ఇరు జట్లు చూస్తున్నాయి. రెండు టీమ్స్ బలంగా ఉండడంతో రసవత్తర పోరు ఖాయంగా కనిపిస్తోంది. గుజరాత్‌కు శుభ్‌మాన్ గిల్, పంజాబ్‌కు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహిస్తున్నారు. గత సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపిన అయ్యర్‌పై భారీ అంచనాలు ఉన్నాయి.



శుభ్‌మాన్ గిల్ వరుసగా రెండో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. గుజరాత్ ఈసారి పూర్తిగా మారిపోయింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ జట్టులోకి వచ్చాడు. అతడు గిల్‌తో కలిసి ఓపెనింగ్ చేయనున్నాడు. మూడో స్థానంలో సాయి సుదర్శన్, గ్లెన్ ఫిలిప్స్ నాలుగో స్థానంలో ఆడనున్నారు. షారుఖ్ ఖాన్, రాహుల్ తెవాటియాలు 5, 6 స్థానంలో వస్తారు. వాషింగ్టన్ సుందర్, రషీద్ ఖాన్ స్పిన్ విభాగంలో ఆడతారు. ఫాస్ట్ బౌలింగ్ కోటాలో కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలు ఆడనున్నారు.

కోల్‌కతా ఓపెనర్లుగా ప్రభ్‌సిమ్రాన్ సింగ్, జోష్ ఇంగ్లిస్ ఆడనున్నారు. ప్రియాంష్ ఆర్య, శ్రేయాస్ అయ్యర్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్, శశాంక్ సింగ్ తరువాతి స్థానాల్లో బ్యాటింగ్ చేయనున్నారు. అర్ష్ దీప్ సింగ్, మార్కో జాన్సెన్ పేస్ కోటాలో యుజ్వేంద్ర చహల్, హర్‌ప్రీత్ బ్రార్ స్పిన్ కోటాలో ఆడనున్నారు. పేసర్ లాకీ ఫెర్గూసన్ జట్టులో ఉండాలంటే జోష్ ఇంగ్లిస్ స్థానంలో నేహాల్ వాధేరా ఆడే అవకాశం ఉంది.

### తుది జట్లు:

గుజరాత్: జోస్ బట్లర్, శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్, గ్లెన్ ఫిలిప్స్, షారుఖ్ ఖాన్, రాహుల్ తెవాటియా, వాషింగ్టన్ సుందర్, రషీద్ ఖాన్, కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ. కోల్‌కతా: ప్రభ్‌సిమ్రాన్ సింగ్, జోష్ ఇంగ్లిస్, ప్రియాంష్ ఆర్య, శ్రేయాస్ అయ్యర్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్, శశాంక్ సింగ్, అర్ష్ దీప్ సింగ్, మార్కో జాన్సెన్, యుజ్వేంద్ర చహల్, హర్‌ప్రీత్ బ్రార్.

# నికోలస్ పూరన్ అరుదైన రికార్డు.. హిట్‌మ్యాన్ రోహిత్ వల్ల కూడా కాలే!

వెస్టిండీస్ హార్డ్ హిట్టర్, లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ నికోలస్ పూరన్ అరుదైన రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. టీ20 క్రికెట్‌లో 600 సిక్సర్ల మైలురాయిని అధిగమించిన నాలుగో ఆటగాడిగా నిలిచాడు. ఐపీఎల్ 2025లో భాగంగా సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 సిక్సర్లు బాదడంతో పూరన్ తన టీ20 కెరీర్‌లో 600 సిక్సర్ల మైలురాయిని అధిగమించాడు. దాంతో క్రికెట్‌లో అత్యంత భయంకరమైన హిట్టర్లలో తాను ఒకడినని నిరూపించాడు.



నికోలస్ పూరన్ కంటే ముందు టీ20 క్రికెట్‌లో 600 సిక్సర్లు బాదిన ఆటగాళ్లు వెస్టిండీస్ వారే కావడం విశేషం. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ 463 మ్యాచ్‌ల్లో 1056 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. విండీస్ మాజీ ప్లేయర్స్ కీరాన్ పొలార్డ్ (908 సిక్సర్లు), ఆండ్రీ రస్సెల్ (733 సిక్సర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. తాజాగా ఈ జాబితాలో నికోలస్ పూరన్ చేరాడు. పూరన్ 385 టీ20 మ్యాచ్‌ల్లో 606 సిక్సర్లు బాదాడు. 2023 నుండి లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతూ కీలక ఆటగాడిగా ఉన్నాడు. లక్నో తరఫున 30 మ్యాచ్‌ల్లో 65 సిక్సర్లు బాదాడు. ఈ ఘనత హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ వాళ్ళ కూడా కాలేదు. ఇక ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పూరన్ వీరవిహారం చేశాడు. 30 బంతుల్లోనే 75 పరుగులు బాదాడు. ఇందులో 6 ఫోర్లు, 7 సిక్స్‌లు ఉన్నాయి.

# ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు నా గురువుకు అంకితం

ఐపీఎల్ 2025లో భాగంగా సోమవారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఒక వికెట్ తేడాతో లక్నో సూపర్‌జెయింట్స్‌ను ఓడించింది. 209 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించే క్రమంలో.. ఢిల్లీ 65 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే.. అశుతోష్ శర్మ అజేయ ఇన్నింగ్స్‌తో అసాధ్యాన్ని సాధ్యం చేశాడు. ఒక దశలో ఢిల్లీ ఓడుతుందని అందరు అనుకున్నారు. కానీ అశుతోష్ శర్మ (66 లి), విప్రాజ్ నిగమ్ (39) కలిసి కీలక భాగస్వామ్యాన్ని అందించారు. అశుతోష్ 31 బంతుల్లో ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 66 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్ అనంతరం అశుతోష్ తన ఇన్నింగ్స్‌ను గురువు శిఖర్ ధావన్‌కు అంకితం చేశాడు. ధావన్ ముందు నుంచే అశుతోష్ టాలెంట్‌ను గుర్తించి అతనికి ప్రోత్సాహం ఇచ్చారు. అతని మద్దతు కారణంగానే తాను మెరుగైన ఆటగాడిగా ఎదిగానని అశుతోష్ చెప్పుకొచ్చాడు. అశుతోష్ డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకున్న వెంటనే మరో సర్‌ప్రైజ్ ఎదురైంది. తన గురువు శిఖర్ ధావన్ వీడియో కాల్ ద్వారా అశుతోష్‌ను అభినందించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తమ సోషల్ మీడియా పేజీలో 'లవ్ యూ పాజీ' అంటూ ఈ వీడియోను షేర్ చేసింది. కాగా.. ధావన్ నుండి వచ్చిన అభినందనతో అశుతోష్‌కు మరింత ఉత్సాహాన్ని అందించింది. కాగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ఈ విజయంతో ఐపీఎల్ 2025లో తమ గెలుపును మొదలుపెట్టింది. లక్నో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ.. ఢిల్లీ మిడిలార్డర్, టెయిలెండర్లు అద్భుత ఇన్నింగ్స్ ఆడారు. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన థ్రిల్లింగ్ అనుభూతిని అందించింది. అశుతోష్ శర్మ తొలిసారి శిఖర్ ధావన్‌ను ఐపీఎల్ 2024 ప్రీ-సీజన్ క్యాంప్‌లో కలిశాడు. వీరిద్దరూ అప్పుడు పంజాబ్ కింగ్స్‌లో భాగంగా ఉన్నారు. అశుతోష్ టాలెంట్ చూసి ముగ్ధుడైన ధావన్.. అతనికి తన బ్యాట్‌ను బహుమతిగా ఇచ్చాడు. అశుతోష్ రంజీ ట్రోఫీ అరంగేట్రంలో గుజరాత్‌పై సెంచరీ చేసిన ఈ బ్యాట్‌తో ఇది అతనికి చిరస్మరణీయ బహుమతి. దేశవాళీ క్రికెట్‌లో అశుతోష్ శర్మ రైల్వేస్ తరఫున ఆడుతున్నాడు.



CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## ప్రభాస్ తో కలిసి నటించడం నా అదృష్టం : మాళవిక



మాళవిక మోహనన్ దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంది. 2013లో మలయాళ చిత్రం 'పెట్టం పోలె' ద్వారా వెండితెరకు పరిచయమైన ఆమె, మలయాళంతో పాటు తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో కూడా నటించింది. గ్లామర్ మరియు టాలెంట్ కలిగిన నటిగా మాళవిక మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది.ప్రస్తుతం ఆమె తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'ది రాజాసాబ్' సినిమాలో మాళవిక కథానాయికగా నటిస్తోంది. ఇది కాకుండా, తమిళంలో కార్తీ హీరోగా వస్తున్న 'సర్దార్ 2' చిత్రంలో కూడా ఆమె నటిస్తోంది.

**ప్రభాస్‌పై ప్రశంసలు**

తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాళవిక మోహనన్ మాట్లాడుతూ ప్రభాస్‌పై ప్రశంసల వర్షం కురిపించింది."ప్రభాస్ గొప్ప వ్యక్తిత్వం కలిగిన హీరో. ఆయన మంచితనం, సహృదయతను చూసి ఫిదా అయిపోయాను. ప్రభాస్‌తో కలిసి నటించడం నిజంగా నా అదృష్టం. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం జీవితాంతం గుర్తుంచుకునే అనుభవంగా మిగిలిపోతుంది."అంతేకాకుండా, ఈ సినిమాలో అవకాశాన్ని లక్కీగా భావిస్తున్నానని, ప్రభాస్ లాంటి స్టార్ హీరోతో నటించడం నిజంగా సంతోషకరమని చెప్పింది. షఉటింగ్ సమయంలో ఆయన అందరితో చాలా ఫ్రెండ్లీగా ఉండటం తనకు ఎంతో బాగా నచ్చిందని వెల్లడించింది.

**'ది రాజాసాబ్ హారర్ కామెడీ థ్రిల్లర్**

ది రాజాసాబ్' హారర్ కామెడీ థ్రిల్లర్ గా తెరకెక్కుతోంది. ఇందులో ప్రభాస్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేలా దర్శకుడు చిత్రాన్ని రూపొందిస్తున్నారని సమాచారం.ప్రస్తుతం ఈ సినిమా షఉటింగ్ శరవేగంగా జరుగుతోంది.భారీ అంచనాల మధ్య ఈ చిత్రం తెరకెక్కుతుంది.

**ఫిల్మ్ కెరీర్**

మాళవిక 2013లో మలయాళంలో తొలి చిత్రం 'పెట్టం పోలె' ద్వారా ఎంట్రీ ఇచ్చింది.2017లో రజనీకాంత్ నటించిన 'పేట' చిత్రంలో కనిపించింది.విజయ్ సరసన 'మాస్టర్' (2021) సినిమాతో కోలీవుడ్ లో మంచి గుర్తింపు పొందింది.2023లో 'యుద్ధం శరణం', 'హీరో' సినిమాల్లో నటించి తన అద్భుతమైన అభినయాన్ని ప్రదర్శించింది.ప్రస్తుతం తెలుగులో ప్రభాస్ సరసన 'ది రాజాసాబ్' సినిమా చేస్తున్న మాళవిక మోహనన్, త్వరలో మరిన్ని భారీ ప్రాజెక్టుల్లో నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది






## తెలుగు చిత్ర పరిశ్రమను పొగిడిన సన్నీ డియోల్

ప్రముఖ బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ టాలీవుడ్‌లో స్థిరపడాలని ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దక్షిణాది చిత్ర పరిశ్రమలో నటీనటులకు ఇచ్చే గౌరవం తనను ఎంతో ఆకర్షించిందని జాట్ చిత్ర ప్రమోషన్ ఈవెంట్ లో సన్నీడియోల్ మాట్లాడుతూ,టాలీవుడ్ నిర్మాతల నుంచి బాలీవుడ్ నిర్మాతలు ఎన్నో విషయాలు నేర్చుకోవాలని సూచించారు.

**జాట్ చిత్రం**

సన్నీ డియోల్ ప్రస్తుతం టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 'జాట్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. చిత్ర ప్రమోషన్ ఈవెంట్‌లో పాల్గొన్న సన్నీ డియోల్, టాలీవుడ్ సినిమా తీరుతెన్నులు, నిర్మాణ విధానంపై ప్రశంసలు కురిపించారు.టాలీవుడ్ నిర్మాతల నుంచి బాలీవుడ్ నిర్మాతలు ఎన్నో విషయాలు నేర్చుకోవాలి అన్నారు.దక్షిణాదిలో నటీనటులకు గౌరవం ఎక్కువ, వారి అభిప్రాయాలను స్పష్టంగా వినిపించే తత్వం ఉంది, ఇది బాలీవుడ్‌లో కనిపించడం లేదని చెప్పారు.సినిమా నిర్మాణంలో స్పష్టత, కథాపరమైన నిబద్ధత, టాలీవుడ్ చిత్రాలను ప్రత్యేకంగా నిలిపే అంశాలని అభిప్రాయపడ్డారు.

**యాక్షన్ డ్రామా**

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'జాట్' యాక్షన్ డ్రామా గా తెరకెక్కుతోంది.సయామీ ఖేర్, రెజీనా కథానాయికలుగా నటిస్తుండగా,రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రం ఏప్రిల్ 10న భారీ స్థాయిలో విడుదల కానుంది.

**సన్నీడియోల్ వ్యాఖ్యలు**

ఒకప్పుడు బాలీవుడ్‌లో దర్శకులు చెప్పినట్లు నిర్మాతలు అనుసరించేవారని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని అన్నారు.ఇప్పుడు కమర్షియల్ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు, కంటెంట్ కంటే మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని సినిమాలు తీయడం వల్ల ప్రేక్షకులు ఆశక్తి కోల్పోతున్నారు అని వ్యాఖ్యానించారు.దక్షిణాది సినిమాల్లో కథకి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో, నటీనటులను ఎలా గౌరవిస్తారో నేను ప్రత్యక్షంగా అనుభవించాను అని తెలిపారు.భవిష్యత్తులో మరిన్ని టాలీవుడ్, దక్షిణాది సినిమాల్లో నటించాలని ఉందని వెల్లడించారు.

**తెలుగు సినిమా**

సన్నీ డియోల్ వ్యాఖ్యలు బాలీవుడ్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చెప్పడమే కాకుండా, దక్షిణాది సినిమా స్థాయిని, గొప్పతనాన్ని మరింత వెలుగులోకి తెచ్చాయి. 'జాట్' సినిమాతో టాలీవుడ్‌కు మరింత దగ్గరవ్వాలని భావిస్తున్న ఆయన, భవిష్యత్తులో మరిన్ని తెలుగు సినిమాల్లో నటించాలనే ఆశక్తి ఉందని చెప్పారు.

## వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న విజయ్ ఆఖరి చిత్రం




**విజయ్ రాజకీయ ఎంట్రీలో కొత్త అడుగు!**

తమిళ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోగా దూసుకెళ్తున్న తలపతి విజయ్ ఇప్పుడు రాజకీయ రంగంలోనూ తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల తమిళగ వెట్రి కళగం (%ఀఎఖ%) పార్టీని ప్రారంభించిన విజయ్, తమిళనాడు 2026 శాసనసభ ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. రాజకీయంగా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, అభిమానులకు ఓ గుడ్ న్యూస్ అందించారు. తన ఆఖరి సినిమా "జన నాయగన్" రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయనున్నారు.

**జన నాయగన్ పై భారీ అంచనాలు!**

విజయ్ స్క్రీన్ పై కనిపించే ఆఖరి సినిమా కావడంతో జన నాయగన్ పై అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్, ప్రియమణి, ప్రకాశ్ రాజ్, మమితా బైజూ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ఈ సినిమాలో సూపర్ పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది.

**సంక్రాంతికి విజయ్ అభిమానులకు ప్రత్యేక కానుక!**

తలపతి విజయ్ సినిమాలు ఎప్పుడూ భారీ అంచనాల మధ్య విడుదలవుతాయి. ఇక జన నాయగన్ అయితే మరింత స్పెషల్. ఎందుకంటే ఇది ఆయన కెరీర్‌లో చివరి సినిమా. రాజకీయ జీవితం ప్రారంభించబోతున్న విజయ్ ఇకపై సినిమాలకు పూర్తిగా గుడ్‌బై చెప్పనున్నారు. అందుకే ఈ మూవీపై అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. సంక్రాంతికి విజయ్ నుంచి వచ్చే చివరి సినిమా కావడంతో, ఫ్యాన్స్ ప్రత్యేకంగా ఈ చిత్రాన్ని ఆస్వాదించేందుకు రెడీ అవుతున్నారు.

## రాజేంద్ర ప్రసాద్ నటిస్తున్న 'షష్టిపూర్తి' విడుదలకు సిద్ధం

రాజేంద్ర ప్రసాద్ నటిస్తున్న 'షష్టిపూర్తి' విడుదలకు సిద్ధం సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'షష్టిపూర్తి' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ కుటుంబ కథా చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా స్వరాలు సమకూర్చారు. ఇప్పటికే చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలను ప్రారంభించగా, తాజాగా 'ఏదో ఏ జన్మలోడో' అనే పాటను విడుదల చేశారు. ఇళయరాజా మ్యూజిక్ %-% కీరవాణి సాహిత్యం!ఈ పాట విశేషం ఏమిటంటే, ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం. కీరవాణి స్వయంగా లిరిక్స్ రాయడం. ఇళయరాజా స్వరపరిచిన పాటకు కీరవాణి సాహిత్యం అందించడం ఇదే మొదటిసారి కావడంతో సంగీత ప్రియుల్లో ప్రత్యేక ఆసక్తిని రేపుతోంది.ఇకపోతే, ఈ మ్యూజికల్ ట్రాక్‌ను స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ అధికారికంగా లాంచ్ చేశారు. 'ఏదో ఏ జన్మలోడో' పాటలో రూపేష్, ఆకాంక్ష సింగ్ జంటగా కనిపించనున్నారు.పాటపై దర్శకుడు పవన్ ప్రభా స్పందన ఈ పాట గురించి మాట్లాడుతూ దర్శకుడు పవన్ ప్రభా మాట్లాడుతూ,"ఇళయరాజా గారి మ్యూజిక్, కీరవాణి గారి సాహిత్యం, అనన్య భట్ గారి ఆవేశభరిత గాత్రం %-% ఇవన్నీ కలిసొచ్చి అద్భుతమైన పాటగా మలిచాయి" అని తెలిపారు. షష్టిపూర్తి కథలో ఎవరెవరు? ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్‌తో పాటు అర్చనా, రూపేష్, ఆకాంక్ష సింగ్, అచ్యుత్ కుమార్, తెనాలి శకుంతల వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కుటుంబ బంధాలను హృద్యంగా ఆవిష్కరించే ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకునేలా ఉంటుందని చిత్రబృందం నమ్మకంగా ఉంది.'షష్టిపూర్తి' చిత్రం త్వరలో థియేటర్లలో సందడి చేయనుంది!



## 'ఛావా' స్పెషల్ షో గా హాజరైన మోదీ, కేంద్ర మంత్రులు



క్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించిన 'ఛావా' సినిమా ఫిబ్రవరి 14న విడుదలై భారీ విజయాన్ని సాధించింది. బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు రాబడుతూ, ప్రేక్షకుల నుంచి విశేష స్పందన పొందుతోంది. మరాఠా వీరుడు శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కింది.

**స్పెషల్ స్క్రీనింగ్**

ఈ చిత్రాన్ని పార్లమెంట్‌లో ప్రదర్శించనున్నట్లు సమాచారం. పార్లమెంటు బాలయోగి ఆడిటోరియంలో గురువారం స్పెషల్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రత్యేక ప్రదర్శనను వీక్షించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరవుతారని ఊహాగానాలు ఉన్నాయి. అలాగే విక్కీ కౌశల్ సహా చిత్ర బృందం కూడా ఈ ప్రదర్శనకు హాజరవుతుందని వార్తలు వస్తున్నాయి. అయితే, ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం లేదా చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు.

**'ఛావా' సెన్సేషన్**

'ఛావా'లో శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్,ఆయన భార్య యేసుబాయి పాత్రలో రష్మిక మందన్నా,ప్రధాన ప్రతినాయకుడు ఔరంగజేబుగా అక్షయ్ ఖన్నా కనిపించారు.విక్కీ కౌశల్ నటనపై సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపించారు. సినిమాటోగ్రఫీ, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సీన్స్ హైలైట్‌గా నిలిచాయి.రూ.500 కోట్ల మార్కును దాటేసిన 'ఛావా',విక్కీ కౌశల్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమా.ఇటీవల విడుదలైన తెలుగు వెర్షన్ కూడా సూపర్ హిట్ అయ్యింది.బాలీవుడ్‌లోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో హిట్ అయిన ఈ చిత్రం, ప్రభుత్వం నుండి ప్రత్యేక గౌరవం పొందడం సినిమాకు మరింత గౌరవాన్ని తీసుకువచ్చింది. పార్లమెంట్ తో ఈ సినిమా ప్రదర్శనపై అధికారిక ప్రకటన కోసం అందరూ ఆశక్తిగా ఎదురుచూస్తున్నారు.

**ప్రధాని మోదీ ప్రశంసలు**

ఇటీవల జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనం ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ ఛావా సినిమా పై ప్రశంసలు కురిపించారు. ఛావా సినిమా పేరు ప్రస్తుతం అంతటా వినిపిస్తోందని మోదీ అన్నారు. దేశంలో మరాఠీ భాష చాలా గొప్ప సాహిత్యాన్ని అందించిందని, మహారాష్ట్ర ప్రజలు గతంలో సైన్స్, ఆయుర్వేదం, లాజికల్, రీజనింగ్ వంటి వాటికి అద్భుతమైన కృషి చేశారని మోదీ అన్నారు. మహారాష్ట్ర, ముంబై కేవలం హిందీ సినిమాలు మాత్రమే కాకుండా మరాఠీ చిత్రాల స్థాయిని పెంచడంలో కీలక పాత్ర పోషించిందని మోదీ చెప్పుకొచ్చారు.'ఛావా' సినిమా ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా అని అభిప్రాయపడ్డారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339